Sree Rama Fancies
20-17 BALAJI NAGAR
NELLORE-2. (A.P.)

No 1640

# అవశేషం

ఆ రోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

పడుతుందని అనుకోనూ లేదు. పట్టడము సాధ్యమూ కాదు. మానసాకాశమంతటా అందాల ఆనందాలే నిండిన వేళ-హృదయం పురివిప్పిన మత్తమయూరంలా నృత్యమాడుతున్న వేళ నిద్రాదేవత ఆగమనం కోసం నిరీక్షించే వెర్రిదాన్ని గూడా గాను.

ఏం నిద్ర! పాడునిద్ర! మ్రాని మొద్దులకు, బండ రాళ్ళకు నిద్రంటే చాలా ప్రియం! అసలు కంటికి కనిపించని నిద్ర అనే అవస్థ ఏదైతే ఉందో, అది ఘనపదార్థంగా పరిణామం చెందడం వల్లనే అలాంటి వస్తువులు ఏర్పడ్డాయేమోనన్న అనుమానం కలుగుతుంది నాకు! నేను మనిషిని. నరాల్లో రక్తం. మనస్సులో మధుకోహ. హృదయంలో ప్రేమోద్వేగం తొణికిసలాడే మనిషిని! ఈ క్షణాన నేను కలకంఠినై మాకందతరుశాఖపైన కూర్చోవాలని ఉంది! ఈ క్షణాన నేను రాజహంసినై మానసకాసారంలో విహరించాలని ఉంది! ఈ క్షణాన నేను మన్మథుడి రథానికి బావుటానై వసంత వనాంత వీథుల్లో రెపరెపలాడాలని ఉంది.

కిటికీగుండా లోపలికి వచ్చి పట్టె మంచంపైన పడుతోంది వెన్నెల. వెన్నెల కడ్డంగా బయట తోటలో కొబ్బరి మట్టలు గాలికి కదులుతున్నాయి. మట్టలు కదిలినప్పుడల్లా వెన్నెల కదులుతోంది. వెన్నెల వెలుగులు, కొబ్బరాకుల

నీడలు సముద్ర తీరాన విహరిస్తున్న ప్రేయసీ ప్రియులకు మల్లే నా నీలిరంగు షిఫాన్ చీరపైన ఆడుకుంటున్నాయి. ఒడలు పులకరించే ఆ తీయటి ఊహలో మైమరిచి నా వైపు నేనొకసారి సిగ్గు సిగ్గుగా చూచుకున్నానేమో, నా ఒళ్లు ఒళ్ళంతా ఒకే ఒక పూలదండలా ఉంది!

ఆనందం నన్ను నిద్రపోనివ్వదు. ఉత్సాహం నన్ను ఊరికే ఉండనివ్వదు. లేచి గదిలో లైటు వేశాను.

అమ్మ దూరంగా నడవ కావలి గదిలో నిద్రపోతోంది. హాల్లో పడుకున్న అన్నయ్య పడుకున్న మరుక్షణంనుంచీ గురక పెడుతున్నాడు. నౌఖర్లు చాకర్లు వంట గదిలో, పశువుల కొట్టాల దగ్గర పాకల్లో ఎక్కడవాళ్లక్కడ ముసుగులు బిగతన్నేశారు. నిద్రపట్ల నాకెంత వైముఖ్యం ఉన్నా అది మానవ సహజం. వాళ్ళు నిద్రలో మేను మరవడం నాకాశ్చర్యం కలిగించదు. కానీ ఈ మొద్దు—సద్దు సేయని సెలయేరులా ప్రవహించడానికి నేర్చుకున్న ఈ దొంగ, చూపుల తూపులతో నిర్మించిన చెరసాలలో నన్ను బంధించి కటకటాలలో నుంచీ తనను తనివితీరా చూచుకోడానికి అనుమతించిన ఈ ఉదార హృదయుడు, ప్రేమ మందిర ద్వారాలకు మందారపూల తోరణాలు కట్టి ఈ ఇందుబాల నిద్రలేచి వచ్చి తొంగి చూచేసరికి కనుమరుగై పోవడానికి నేర్చుకున్న ఈ పాలు త్రాగని పిల్లి ఈ ప్రకారం నిద్రపోగలగడమే నాకాశ్చర్యం!

ఏం భయమా! ఆశ్చర్యాన్ని ఆశ్చర్యంతో గుణించగా ఏర్పడే మహదాశ్చర్యమని గూడా చెబుతాను.

కాకపోతే ఊరించి ఊరించి ఈ చక్కెర పొంగలి

నీ దేసయ్యా అంటే, కానీ లెమ్మనట్లు చడీ చప్పుడూ లేకుండా నిద్రపోతాడా ఈ పెద్దమనిషి!

ఓహో ప్రకాశం! ఓయీ ఇందుబాలా హృదయ మందిర విహారీ! నీ పని యిప్పుడు గాదు.

నిద్రా రాదు. కాలమా గడవదు. మరేం చేయాలో తోచదు.

మనసు కేమీ తోచని ఏకాంత సమయాల్లో నాకు నా నెచ్చెలి తోడు వుండనే వుంది. అది నా మధురస్మృతుల పేటిక. నా మనసును నేనే చదువుకోటానికి ఉపకరించే విద్యుద్దీపిక.

డైరీ చేతికి తీసుకుని వాలు కుర్చీలో కూర్చున్నాను. చేతికి తగిలిన పుటపైన చూపులు జారిపోతున్నాయి.

"హాస్టల్లో తెల్లవారగా, పవలంతా కాలేజీలో గడ వగా గోడల నడుమ బ్రతుకంతా బంధిఖానా! ఎందుకొచ్చిన చదువులురా బాబూ! ఎటొచ్చీ సాయంకాలాల్లోనే యిసుమంత స్వేచ్ఛ. బ్రతికానురా దేవుడా అని టౌనులో కెళ్తే అన్నయ్య గదికి తాళం! వాకబు చేయగా అన్నయ్య, ప్రకాశమూ ఏదో మీటింగుకు వెళ్లారని వార్త! ముదనష్టపు మీటింగులు ఎక్కడినుంచి దాపురిస్తాయో ప్రకాశానికి! మంచి సాయంకాలాన్ని పాడుచేయడం భావ్యం కాదని అన్నయ్య, అయినా వారించగూడదూ? అబ్బే, అతణ్ణని ఏం లాభం? ప్రకాశం ప్రకాశమైతే, అన్నయ్య నీడ!

బజార్లో మైథిలి కనిపించడమే విశేషం! మట్టసపు కట్టు తీరులో తెల్లగా చలువరాతి బొమ్మలా తయారైంది.

అలాంటి వేషమంటే వాళ్ళ బావగారి కిష్టమట! ఆవిడే చెప్పింది. మరి ప్రకాశానికి ఎలాంటి చీరలంటే యిష్టమో! ఎలా బోధపడుతుంది? ఈ దుస్తుల్లో నువ్వు చాలా బాగున్నావు ఇందూ అని చెప్పగలిగేపాటి సరసత్వం ఎక్కడేడ్చిందమ్మా ఈ మనిషిలో......''

నవ్వొచ్చింది నాకు! కొంపదీసి ఈ డైరీ ఎప్పుడైనా ప్రకాశం కంటబడితే? సరసత్వంలేని మనిషిని ఎందుకు వరించావు ఇందూ అని అడిగితే? ప్రకాశానికే గాదు. అప్పుడప్పుడూ నా కెదురయ్యే సందేహమూ అదే! జవాబు స్ఫురించకనే పోవును. కానీ అలాంటి ప్రమాదం జరగకుండా చూచిన సినిమాలోనిదో, చదివిన పుస్తకంలోనిదో ఓ విషయం తటాలున జ్ఞప్తికి వస్తుంది. ఎందుకు కురంగం పరుగిడుతుంది? ఎందుకు మృదంగం ధ్వనిస్తుంది? ఎందుకు పతంగం ఆకాశంలో విహారాలు సల్పుతుంది? అందుకే నా హృదయం ప్రకాశాన్ని ప్రేమిస్తుంది.

మళ్ళీ డైరీ తెరిచాను.

''ఏనాటి మానవుడమ్మా ఈ ప్రకాశం! సినిమాలంటే సరిపడ వీయనకు! అన్నయ్య బలవంతంమీద జన్మకల్లా శివరాత్రిలా ఓ సినిమా చూడ్డానికి అంగీకరించాడు. ఆ చిత్రంలో ఎక్కువ భాగం కాశ్మీరులో తీశారట! మంచు కొండ శిఖార్లలో మనుజు లెవ్వరూ సంచరించని మారుమూల ఒక చిన్న కుటీరం. బయట ప్రకృతిని అల్లకల్లోలం గావిస్తున్న గాలివాన. వానలో తడిసి గడగడ లాడిపోతూ కుటీరంలోకి వచ్చిన ఓ పడుచువాడికి అందులో నివసిస్తున్న

యువకుడు ఆశ్రయ మిస్తాడు. జలుబుచేసి జబ్బు రావచ్చును గనుక తడి గుడ్డలు విప్పి పొడి బట్టలు కట్టుకోమంటాడు. కానీ, అందుకా పడుచువాడు ససేమిరా ఒప్పుకోడు. నిర్బంధంగా నైనా సరే అతడిచేత ఆపని చేయించే ప్రయత్నంలో వున్నాడు యువకుడు. అసలు గమ్మత్తేమిటంటే ఆ కుర్రాడు నిజంగా కుర్రాడు గాడు. మగవేషంలో వున్న ఆడపిల్ల! హాలంతా విరగబడి నవ్వుతోంది. నాలుగైదు సార్లు గిల్లి చూచి ప్రకాశం నిద్రపోవడం లేదని గ్రహించాను. చిరునవ్వు మినహాగా మనిషిలో చలనం లేదు. వెలగబెట్టిన నిరవాకం చాలక, బయటికొస్తుండగా ఈ థియేటరులో నల్లులూ, దోమలూ దండిగా వున్నట్టున్నాయని ఓ కాంప్లిమెంటు!

ఒళ్లు మండిందేమో, హాస్టలు కొచ్చి డైరీ తీసుకునే సరికి ఒక్కటే పదం స్ఫురించింది—ఇర్రసికుడు!

ప్రకాశ మెప్పుడైనా అడగాలీ, అప్పుడు అంబుల పొదిలో నుంచీ బాణం తీయాలి—అయ్యో ప్రకాశం! ఈ పదం నిఘంటువుల్లో లేదని చింతిల్లబోకు! రెగులర్ అనే పదానికి వ్యతిరేకార్థ మిచ్చే పదం యిర్రెగులరని తెలుసు గదా! ఆ సూత్రాన్ని యథాతథంగా తెలుగులోకి తెచ్చి ఈ ప్రయోగాన్ని సాధించాను. రసికుడికి—యిర్రసికుడు!"

ఆలోచనా పరాధీననై వున్నానేమో. డైరీలో కొన్ని పేజీలు నన్ను పలకరించకుండానే వెనక్కి వెళ్ళిపోయాయి. చూపు కానిన పేజీని ఒకటికి రెండుసార్లు చదువుకున్నాను.

"చిరస్మరణీయమైన విషయం. జీవితంలో తొలి సారిగా ఓ పాట వ్రాశాను. పాటలో హృదయం పలుకు తోంది. పాట బాగా కుదిరిందేమో ఏనుగెక్కినంత సంబ రంగా వుంది. ఆనంద పారవశ్యం మనసు కింత మత్తు కలి గిస్తుందని తెలియదు. అపూర్వమైన అనుభవం!

వ్రాసి ప్రకాశానికి పోస్టు చేసేలోగా ఎన్నిసార్లు పాడు కున్నానో ఆ పాటను!

మదికి నచ్చిన వాడ
హృదయ మేలిన వాడ
మల్లికా కుసుమాల మాల యిదిగోర!
చల్లగా చందన చర్చ యిదిగోర!
ప్రేమ యాత్రల కొరకు
ప్రియుడ! నిను పిలిచాను
ఎల్లలన్నీ దాటి పోదాముదా!
ఎల్ల కాలము కలిసి ఉందాముదా!
ఏనాటి బంధమో
ఏజన్మ పుణ్యమో
తొలిచూపులో నిన్ను వలచానురా!
తోడుగా రమ్మంటు పిలిచానురా!"

డైరీ ఎప్పుడైనా చదువుకోవచ్చు. ప్రణయగీతం పాడుకోడానికి అనువైన ప్రశాంత సమయం వృధాగా గడచి పోతోంది. ప్రకాశానికి పాడి వినిపించాలన్న కోరిక ఒకటి

ఎన్నో రోజుల నుంచీ గుండెల్లో దాగి వుండిపోయింది. వింటూ మంచుగడ్డలా కరిగిపోడా ప్రకాశం! నువ్వింత చక్కగా పాడగలవు గూడానా ఇందూ—అంటుండగా ప్రకాశం ముఖంలో సుళ్లుదిరిగే ఆశ్చరాన్ని చూడాలి...

అలా ఆశ్చర్యంగా, మరొక లోకపు మనిషిలా నా వైపు చూచే ప్రకాశాన్ని తలచుకుంటే జాలేస్తుంది. ఒక్కొక్కప్పుడు భయం గూడా కలుగుతుంది. ఎన్నో పనులు చేతగావతనికి! ఉదాహరణ కెంతో దూరం వెళ్ళనక్కర లేదు. అతడి జాబులన్నీ నాకు కంఠో పాఠమే!

వ్రాసిపంపిన పాటకు మరు టపాలో వచ్చిన బదులు—

"డియర్ ఇందూ!

జాబు చేరింది. పాట ఎంతో బాగుంది. నువ్వింత చక్కగా వ్రాయగలవని నేను కలలోనైనా అనుకోలేదు. అన్నట్టు యిది నీ మొదటి పాటా? అమ్మ దొంగా, నేన్నమ్మ లేను. నీమాటే నిజమైతే నీలో గొప్ప కవితాశక్తి దాగి వుందన్నమాట! ప్రప్రథమంగా దానికి స్వాగతమిచ్చే అవకాశం నాకు కలగడం మహాభాగ్యంగా భావిస్తున్నాను.

ఇలాగే పాటలు వ్రాయాలి నువ్వు.

ఇట్లు
ప్రకాశం."

ప్రియురాలి చేతిమీదుగా తయారైన కాఫీ పానీయం ఎదుట అమృతాన్ని దిగదుడుపుగా భావించడం ప్రేమికుల

లక్షణం. ప్రకాశం మెచ్చికోలు ప్రకటించాడు సరే! కానీ, అంతకన్నా పాట మూలంగా తన మనసుపైన విస్తరిల్లిన అనుభూతిని గురించి అతడు నాలుగు మాటలు వ్రాసివుంటే ఎంత బాగుండేది! పూచిన ప్రతి పువ్వులోనూ ప్రేయసి నవ్వును, ప్రవహిస్తున్న ప్రతి కొండ వాగులోనూ ప్రేయసి వలపు పాటను—అంతెందుకు, మంటికీ, మింటికీ మధ్య కనిపించే ప్రతి సుందర దృశ్యంలోనూ ప్రియురాలి దివ్యాంశనే తిలకించి పులకించే ప్రేమికుల కోవకు చెందడా ప్రకాశం! పాట బాగుందట! ఇంత చక్కగా వ్రాయగలనని అనుకోలేదట! ప్రొఫెసరుగారు శిష్యుడి నిలా మెచ్చుకుంటారేమో! ఒకవేళ అన్నయ్యే యిలాంటి పాట వ్రాసినా, అక్షరక్రమం తప్పకుండా యిలాగే మెచ్చుకునేవాడు ప్రకాశం!

"పట్ట పరీక్షల్లో ఫస్టు మార్కులు తెచ్చుకునే ప్రకాశంగారూ! ఇదేనా హృదయాన్ని ఆవిష్కరించే తీరు?" అని నిలదీసి అడిగాను.

తప్పు చేసినట్టుగా కించపడిపోయాడు ప్రకాశం.

"ఏం చేయమంటావు విందూ! అంతకంటే బాగా వ్రాయడం నా చేతకాదు. ఈ విషయంపైన ఎవరిదగ్గరైనా ట్యూషన్లు చెప్పుకోవాలని గూడా వుంది" అన్నాడు ప్రకాశం.

"నేను చెబుతాను. మీరు నేర్చుకుంటారా?" అన్నాను.

పశ్చిమ దిశాంచలాన సంజ కెంజాయలా మౌనంతో మిళితమైన చిరునవ్వే జవాబు!

గణితశాస్త్రంలో దిట్ట! రసాయనిక శాస్త్రం కరతలామలకం! ప్రకాశంది అదొక విజ్ఞాన ప్రపంచం. వ్యక్తిగత విషయాలను గురించిన ధ్యాస ఏమాత్రమూ వుండ దతనికి! బట్టలు మాసిపోతున్నాయని తెలియదు. చేతికొచ్చిన డబ్బును టేబిలు సొరుగులో పడవేస్తే అందులో ఎంత ఖర్చయిందో తెలియదు. కాలేజీకి వేళవుతోందని తెలియదు. వయసులో ప్రకాశంకన్నా ఒకటి రెండేళ్లు చిన్నవాడేనేమో అన్నయ్య! కానీ ఎప్పటికప్పుడు మిత్రుడి అవసరాలను గమనించవలసిన పెద్దరికపు బాధ్యత పిన్నతనంలోనే అన్నయ్యను వరించింది. బట్టలు మార్చుకో ప్రకాశం!...ముఖం గోక్కోకూడదయ్యా బాబూ!...ఈ రోజు స్నానం చేశావానువ్వు! ...ఈ పూట మనమింకా భోజనం చేయలేదని గుర్తుందా నీకు!...అంటూ అన్నయ్య హెచ్చరికలు చేయవలసి వచ్చేది. రాత్రి భోజనంచేసి వచ్చి బిగ్గరగా పుస్తకపఠనం ప్రారంభిస్తే రాత్రంతా అలా చదవడానికైనా సంసిద్ధుడే ప్రకాశం: ఏ పదకొండుకో, పన్నెండుకో యిక నువ్వు చదివినా నాకు వినే ఓపిక లేదంటూ అన్నయ్య లైటార్పి వేస్తే గత్యంతరం లేక శరీరాన్ని పడకపైన చేరవేస్తాడట ప్రకాశం! అన్నయ్య ఒకసారి చెప్పాడు—ఒక్కొక్క రాత్రి లైటార్పి వేసి తానొక నిద్రపోయి లేచిన తర్వాత చూచినా ప్రకాశం అలాగే కుర్చీలో కూర్చుని కిటికీ చువ్వలగుండా మిలమిలలాడుచున్న తారకలవైపు చూస్తుంటాడట!

అందుకే అనిపిస్తుంది—శరత్ బాబు పాత్రలాంటివాడు ప్రకాశం!

దారితప్పి మానవ కాననంలోకివచ్చి, యిక్కడ దిక్కులు తోచక బిక్కరించే ప్రాణిలా కనిపించే బేల మనసు వాడు ప్రకాశం!

తన మనసును క్షుణ్ణంగా అవగాహన చేసుకోలేని అతివ అర్ధాంగిగా దొరికితే పాపం పిచ్చి ప్రకాశం గతేం కావాలి?

ప్రకాశాన్ని గురించి తలచుకున్నప్పుడల్లా నేను భయ పడ్డందుకు కారణం యిదేనేమో! అలాంటి భయాని కింక ఆస్కారమే లేదు.

ఇప్పుడలా అనిపిస్తున్నమాట నిజమే! కానీ ఇంతకు మునుపు ఎంతగా ప్రయత్నించినా ఇంత నిబ్బరంగా ఉండటా నికి వీలయ్యేది గాదు.

కానీ అప్పుడైనా నేను భయపడ్డందుకు కారణం నా పైన నాకు నమ్మకం లేకపోవడం గాదు.

అందచందాలను గురించి గ్రంథాల్లో బోలెడు వర్ణన లున్నాయి. చిత్రాల్లో, శిల్పాల్లో ప్రతికృతు లున్నాయి. వాటి కన్నింటికీ లోకంలో సజీవమైన నమూనాలు గూడా వున్నాయి. అలాంటి నమూనాలు పెక్కింటిలో కేవలం ఒక్కదాన్నేనా నేను? నిక్కవంగా అంతకంటే ఎక్కువ దాన్నేనని ఋజువుపరచడం అత్యంత సులభం! ఎదుట నిల్చుంటే నిలువుటద్దం చెబుతుంది. కాలేజిలో స్నేహితు రాళ్ళు చెబుతారు. అంతెందుకు! రోడ్డంట వెళ్తుంటే అప్ప గించిన కళ్ళను అవతలికి త్రిప్పుకోలేని పడుచువాళ్ళ చూపులు గూడా ఆ వాస్తవాన్ని బాహాటంగానే చాటి చెబుతాయి.

ప్రకాశం జడధారి కాడు. బ్రహ్మచారిగా వుండిపో దలచుకున్న మనిషిలా కనుపించడు. ఎటొచ్చీ అన్నమైతే నేమిరా, మరి సున్నమైతే నేమిరా అనుకునే నిర్లిప్తత అతడి రక్తంలో జీర్ణించివున్న తత్వం. ఈ లోపం పులిలాంటిదైతే, పులిమీద పుట్రలాగ దాని నేస్తం ఇంకొకటి—ప్రకాశం తనంతట తానుగా ఏ నిర్ణయానికీ రాలేడు.

బహుశా అందుకే ననుకుంటాను—అన్నయ్య చెప్పిన మాట ఒకటి తరచుగా జ్ఞప్తికి వస్తుంది.

"మా క్లాసులో ఓ అపురూపమైన మానవు డున్నాడు, ఇందూ, అతగాడు పగిలిపోయిన ఓడలో నుంచీ ప్రాణాలతో బయటపడి ఎలాగో ఓ నిర్జనద్వీపం చేరుకున్న ఏకాకిలా కనిపిస్తాడు" అన్నాడు అన్నయ్య.

నాకు తోచినంతలో అలాంటి వింత వాలకానికి రెండు కారణాలు స్ఫురిస్తాయి. మొదటిది దిగులు, రెండోది విరహం. ఆ యువకుడు వ్యసనానిష్టుడో, విరహ మనస్కుడో అప్పుడు నాకేం తెలుసు?

అన్నయ్య చెప్పుకపోసాగాడు—"పలుకరిస్తే పలుకు తాడు, తానై ఒకరితో మాట్లాడడు. మనిషి భూమిపైనే వున్నా మనసు మాత్రం వేరేలోకాల్లోకి వలస వెళ్ళినట్టుం టుంది. కాలేజి తెరిచి ఇంకా రెండు నెలలైనా కాలేదు గదా! అప్పుడే అతగాడికి పుస్తకాలన్నీ కంఠతా వచ్చేసి నట్టున్నాయి..."

నిజం చెప్పొద్దూ, బాగా చదువుకునేవాళ్లంటే అన్నయ్య కాదినుంచీ కాస్త అసహిష్ణుత కద్దు! చదువుకేం

భాగ్యం? మనిషికి లోకజ్ఞానం ప్రధానమనేవాడు అన్నయ్య. చదువులవల్ల లోకజ్ఞానం కలగదా అంటే, కలుగుతుందేమో గానీ. అంతకంటే సినిమాలు, ప్రయాణాలు మున్నగు వ్యాసంగాలవల్ల అది యిబ్బడి ముబ్బడిగా కలుగుతుందనేవాడు.

ఎవరి అభిప్రాయాలు వాళ్లవి! అన్నయ్య అభిప్రాయాలు కాంక్రీటు పునాదుల్లా బలమైనవనీ, అంత తొందరగా మారవనీ, అనుకునేదాన్ని! నా అభిప్రాయాన్ని మార్చుకోవలసి వచ్చింది. అందుకు కారకుడు అన్నయ్యకు సహపాఠకుడైన ఆ విచిత్రవ్యక్తి.

ఆ రోజుల్లో అతణ్ణి గురించి అన్నయ్య కొత్త కబుర్లు చెప్పడం పరిపాటి.

ఈ సంగతి విన్నావా ఇందూ! దిగాలు పడినట్టున్న ఆ వాలకాన్ని చూచి ఏమిటో అనుకున్నాను. నా ఊహ తారుమారయిందనుకో! వాళ్ళది సేలంజిల్లాలో ఒక ప్రాచీనాంధ్ర కుటుంబమట! బ్రిటీష్‌వాళ్ల హయాంలో ఆ కుటుంబానికి జమీందారి వుండేదిట! జమీందారి పోయినా ఆ ఠీవి, ఆ నిండుదనం, ఆ దర్పం వాళ్లని వదలిపెట్టినట్టు లేదు. ఆ జిల్లాలో వాళ్లకు దండిగా భూములున్నాయట! మదరాసులో మేడలు వ్యాపారాలు వున్నాయట. దేశంలో వాళ్ళ లారీలు తిరగని చోటే లేదట. ఏ అమ్మగన్న బిడ్డోగాని కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టోలా అవతరించాడనుకో ఇందూ!''

''ఇంతకూ అతని పేరేమిటో?'' కుతూహలం ఆపుకోలేక ప్రశ్నించాను.

"ప్రకాశం."

పేరు తర్వాత రూపును గురించి తెలుసుకోవాలన్న కోరిక నాలో లేకపోలేదు. కానీ నోరు తెరిచి ఎలా అడగను? అది అవతలివాళ్ల కుండవలసిన యింగిత జ్ఞానం.

మళ్ళీ వారం పదిరోజులు గడవకమునుపే అన్నయ్య విప్పారిన ముఖంతో ఓ శుభ వర్తమానాన్ని వెల్లడించాడు.

"నిన్నగాక మొన్న ప్రకాశాన్ని పరిచయంలోకి రాదీశాను ఇందూ! ఏదో నెపంమీద అతణ్ణి పలకరించాలన్నదే ఉద్దేశం! ఈ పద్యం అర్థమై చావడం లేదంటూ దగ్గరికి వెళ్ళాను. ఆ బుద్ధిమంతుడు ఓపిగ్గా విశదీకరిస్తున్నాడు. ఏమాట కామాటే చెప్పుకోవాలి. ప్రకాశం మాట్లాడుతుంటే అతడివైపలాగే చూస్తూ వుండిపోవాలనిపిస్తుంది ఎవరికైనా! అంత మృదువుగా, మితంగా వుంటాయి మాటలు. వ్యాఖ్యానం ముగిశాక ఎక్కడుంటున్నావని అడిగాను. మోహన్ లాడ్జిలో గది తీసుకున్నాడట. వసంత విహార్‌లో భోజనమట! సాయంకాలాల్లో శ్రీపురం గుట్టలవైపు షికారు వెళ్తాడట! మిగిలిన సమయాల్లో చదువుకోవడమే కాలక్షేపమట!..."

అన్నయ్య మాటలే ఆధారంగా ప్రకాశాన్ని గురించి పరిపరి విధాల ఊహాచిత్రాలు కట్టుకునేదాన్ని! అప్పట్లో నాకొక్కటే భయం! అన్నయ్య ఆడదిగా పుట్టివుంటే ఈ పాటికి ప్రకాశాన్ని ప్రేమించి వుండేవాడేమో!

ఆనాడు ఆదివారం, హాస్టల్లో వుండి కాలేజీలో చదువుకునే అమ్మాయిల పరిభాషలో ఆదివారానికి దీపావళనైనా

అర్థం చెప్పుకోవచ్చు: లేదా సంక్రాంతిగానైనా పేర్కొన వచ్చు—కాలుదీసి నాలుగు చోట్లు తిరిగి రావడానికి వీలుంటుంది గనుక! ఆనాడెందుకో నగరం మిగిలిన రోజులకన్నా మిన్నగా కలకలలాడుతోంది. తీరా వెళ్ళిన సమయానికి అన్నయ్య గదిలో వుండడేమోనన్న అనుమానం ఓరవాకిలిగా మూసివున్న తలుపుల్ని చూచిన తర్వాతగానీ తీరింది గాదు. రెక్క తలుపుల్ని మెల్లగా లోపలికి తోశాను. ఎట్ట ఎదుట కుర్చీలో ఓ అపరిచిత యువకుడు—

బాటలూ బజార్లుదాటి, మందిరాలు, మేడలు గడచి ఎండలో పడివచ్చిన నాకు తలుపులు తెరిచేసరికి చల్లటి గదిలో పేము కుర్చీలో నిశ్చలంగా వున్న ఆ యువకుడిరూపం నా మదిలోని కోరికలకన్నింటికీ మూర్తీకరణలా పొడగట్టింది.

పొడగట్టింది సరే! ఎదుటికివచ్చి నిలిస్తే అలికిడి వినిపించలేదుబో. మగువ పొలుపు దెలిపే మారుతమైనా వీచలేదా ఈయనగారిపైకి!

ఓ యబ్బో! ఇంద్రుడే మేనకను పంపినా వంచిన తలను పైకెత్తడా ఈయన!

గడచిన కాలం క్షణంలో సగం. తొట్రుబాటుతో ఓ అడుగు వెనక్కు వేశానేమో, అతడు తల పైకెత్తనే ఎత్తాడు. కొండకొమ్ముపైన నిల్చుని పరిసర దృశ్యాలను అవలోకిస్తున్నట్టుగా ఒకటి రెండు క్షణాలు కన్నార్పకుండా నా వైపు చూచాడు—ఆ తరువాత చెప్పుకోదగిన విశేషమేమీ జరగనేలేదన్నట్టుగా "మీరా! ఆగిపోయా రెందుకు? రండి. కూచోండి" అన్నాడు.

ఒదిగి ఒదిగి ఓ కుర్చీలో కూర్చున్నాను.

"ఈరోజు మీరొస్తారని సురేంద్ర చెప్పాడు..."

బిడియము, ఉత్కంఠ నా గుండెలో పోట్లాడుకుంటున్నాయి. చివరికి రెండోదే గెలిచింది.

ప్రశ్నించాను.

"వచ్చింది నేనేనని మీకెలా తెలుసు?"

"ఇప్పుడు మీరే చెప్పేశారుగా!" అతడు మల్లె పందిరి విరబూచినట్టుగా నవ్వేశాడు—"మీరిద్దరూ ఏకోదరులు గావడమే ప్రబలమైన సాక్ష్యం. పోలిక లెక్కడికి పోతాయి?"

మరికొంతసేపలాగే నావైపు చూస్తే కళ్ళకు ఆజీర్తి చుట్టుకుంటుందనుకున్నాడేమో, అతడు మళ్ళీ అక్షరాల అడివిలోకి జొరబడబోతున్నాడు.

మనం కాబట్టి ఆగంతకురాలిని పోల్చుకో గలిగామన్న ధీమా కాబోలు! ఆ విజయగర్వాన్ని అతని కెందుకు దక్కనివ్వాలి?

మెల్లగా ప్రారంభించాను.

"అన్నయ్య మిమ్మల్ని గురించి చాలాసార్లు చెప్పాడు..."

తృళ్ళిపడ్డాడతను—"నన్ను గురించా? అసలు మీరు నన్నెవర్నిగా భావిస్తున్నారు?"

గోడకు వ్రేలాడుతున్న అద్దంలో సిగ్గుతో కంది పోతున్న ముఖం నాదే! సిగ్గు తెరలను వైదొలిగించుకుంటూ బదులు చెప్పాను.

"తెలుసు!"

"బహుశా మీ రొకరిని గురించి విని ఉంటారు. ఆ 'ఒకరు' నేనే నని ఎలా భావించారు? కాకపోవడం సంభవమే గదా!"

అప్పటికి గడసరితనమంతా ఈయనగారి సొమ్మే అయినట్టు!

చిరునవ్వును చీర చెరగులో దాచుకుంటూ అన్నాను- "సాధారణంగా ఈ గది యిలా ప్రకాశవంతంగా వుండేది గాదు. ఇప్పుడా కొరత తీరిపోయింది. ఇంతకన్నా ఏం నిదర్శనం కావాలి?"

అతడు తెల్లబోయినట్టు కనిపించాడు. అంతలో తేరుకుని పుస్తకం మూసేస్తూ "భలేవారే మీరు! చాలా చమత్కారంగా మాట్లాడగలరు" అన్నాడు.

మొట్టమొదటి యోగ్యతాపత్రం!

"ఈ ఊరికి రావడం, ఇక్కడ కాలేజీలో చేరడం అవన్నీ ఎవరో నాచేత బలవంతంగా చేయిస్తున్నంత అసహజంగా జరిగిపోయాయి. కాలేజిలో చేరిన తరువాత ఒకటి రెండుసార్లు చదువుకు స్వస్తిచెప్పి వెళ్ళిపోదామని గూడా అనుకున్నాను, ఇంతలో నాకు సురేంద్ర తారసిల్లాడు. ఒంటరితనం మనిషికేమంత మంచిదికాదని చెప్పి, వచ్చి నన్ను తన గదిలోనే వుండిపొమ్మన్నాడు..."

"అలాగా! ఇకమీదట ఇక్కడికొస్తే అన్నయ్యతోపాటుగా మిమ్మల్ని గూడా కలుసుకోవచ్చునన్నమాట!"

"సురేంద్ర చెప్పాడు—మీరు నవలలు, కథలు పుష్కలంగా చదువుతారట! తీయగా పాడుతారట!"

"మీకు పాటలంటే యిష్టమా?"

"నా యిష్టా యిష్టాలను మీరు పెద్దగా పరిగణన లోకి తీసుకోగూడదు. జీవనపథంలో నిరంతరమైన ప్రయాణం వల్ల విసిగి వేసారిపోయే మానవులపాలిటికి సంగీత సాహిత్యాలు గొప్ప విశ్రాంతి కేంద్రాలని పెద్దలు చెప్పనే చెప్పారు..."

"కానీ అన్నయ్యకు సంగీతమన్నా, సాహిత్యమన్నా చెప్పరానంత చిరాకు."

"అవును మరి! విశ్రాంతి కేంద్రాల్లో కలకాలం కాలం గడపడానికి వీలుండదు గదా! అలా వుండిపోదలంచు కున్న వాళ్ళని చూస్తే సురేంద్రకి చిరాకేమో! చూడండి ఇందుబాలగారూ! మనం విద్యార్థులం. మనకు చదువు తరు వాతనే మిగిలినవన్నీ..."

"అన్నయ్య కదే మొదటి శత్రువు!"

"పరవాలేదు. వన్యమృగంలాంటి ఆ చదువుని సురేంద్ర క్రమక్రమంగా మచ్చిక చేసుకోగలడు."

కాసేపాగి తరువాత అన్నాను—"అన్నయ్యకు మీ లాంటి స్నేహితుడు దొరికాడని తెలిస్తే మా నాన్నగా రెంతగానో సంతోషిస్తారు..."

"పెద్దవాళ్ళ సంతోషంకన్నా మనకు కావలసిం దేముంది?"

అక్కడితో సంభాషణ తెగిపోయింది. పొడిగించ డానికి వస్తువు దొరక్క బరువుగా స్తబ్దతే నెలకొన్నది.

పది పదిహేను నిమిషాల తర్వాత ప్రకాశమే పెదవి కదిపాడు—"ఊళ్లో కొత్త చిత్రాలు ఆడుతున్నాయట! సురేంద్ర ఏదో సినిమాకు వెళ్తానన్నాడు. వస్తే మిమ్మల్ని ఉండమన్నాడు—"

నా తెలివి తక్కువకు నన్ను నేనే నిందించు కున్నాను. అన్నయ్య ఎక్కడికి వెళ్ళాడని అడగనందుకు ప్రకాశం ఏమనుకుంటాడోనన్న కించబాటులో కుంచించుకు పోయాను. జరిగిన పొరబాటును ఎలా సర్దుకోవాలో తోచిందిగాదు. ఆ వేగిరపాటులో "అబ్బే, నేనూరికే చూచి పోదామనే వచ్చాను, అయిదున్నరకల్లా హాస్టలుకు చేరు కోవాలి. అన్నయ్యతో చెప్పండి" అన్నాను.

"ఐతే మీకు టైం కావస్తోంది, వెళ్దాం పదండి. మిమ్మల్ని బస్‌స్టాపు దాకా దిగవిడిచి వస్తాను." అంటూ పైకి లేచాడు ప్రకాశం.

మనోజ్ఞమైన సాయంకాలం. అది పొగరుబట్టిన గుర్రంలా వాహ్యాళి కొప్పుకోకుండా ఇంటికి తిరుగుముఖం పట్టించింది. మిగిలి ఉన్నవి కొన్ని నిమిషాలు.

"మీరు సేలం జిల్లానుంచి వచ్చారట గదూ! అన్నయ్య చెప్పాడు. మా కాలేజీలో ఓ అరవావిడ పని చేస్తోంది. సేలం జిల్లాలో ఆమెకు బంధువులున్నారుట..."

"ఆ జిల్లావాళ్ళను గురించి ఏమంటుందావిడ?" చిన్నగా నవ్వుతూ అడిగాడు ప్రకాశం.

"మోటువాళ్ళట! వాళ్ళ పాలిటికి రాగిపిండే రాజనాల నివేద్యమట! ఏడాదికి మూడుసార్లు ఎంచినట్టుగా స్నానం చేస్తారట! మొలకొక పంచె గుడ్డ కట్టుకుని తలకొక దుప్పటి చుట్టుకుని, దుడ్డుకర్ర చేతబట్టుకుని కొండల్లో గొడ్లు మేపుకుంటారట!"

"ఆ ప్రాంతంనుంచి వచ్చాను గనుక నన్నూ ఇంచుమించుగా అలాంటివాడిక్రిందే జమకట్టి ఉంటారు మీరు!"

"మీ సంగతి వేరు!"

"ఎవరి సంగతైనా ఒకటే! అందరికీ ఒకటే ముఖ్యం! —బ్రతకడం!"

"అలాగైతే ఎలా బ్రతికినా బ్రతుకేనంటారామీరు!"

"అనను. కానీ, నిత్య నూతనమైన జీవనోత్సాహాన్ని మీరు బ్రతుకుక్రింద జమకడితే అది లేమిలోకూడా పుష్కలంగా ఉందని చెబుతాను..."

"ఎలాగైనా మీలో కొద్దిగానో, గొప్పగానో, ప్రాంతీయాభిమానం ఉన్నట్లే వుంది..."

"ప్రాంతీయాభిమానం గాదు. మనుషులంటే అభిమానం నాకు! అందులోనూ మంచివాళ్ళంటే మరింత అభిమానం."

"అందుకేనా మీరు అన్నయ్యతో స్నేహం చేయడం?"

సంభాషణ కడ్డు తగులుతూ భుజానికి బుట్ట తగిలించుకున్న కుర్రవాడొకడు తారాచువ్వలా ఊడిపడ్డాడు. బుట్టనిండుకూ గులాబీ పువ్వులున్నాయి.

రెండు పువ్వులు కొని ఒకటి ప్రకాశాని కిచ్చాను.

"అబ్బే. నా కెందుకు! ఇది మీ దగ్గరై తేనే శోభి స్తుంది" అన్నాడు ప్రకాశం.

"పరవాలేదు. చొక్కాకు గ్రుచ్చుకోండి, బాగుం టుంది." అన్నాను.

అంతలో బస్సు గూడా దాపురించింది.

నాటికీ నేటికీ నాలుగేళ్లు గడిచినా, ఆ ప్రథమ సమా వేశాన్ని తలచుకుంటే మనసు మందారసుమమై పరిమళిస్తుంది.

కానీ, ఏమాట కామాటే చెప్పుకోవాలి.

వర్షాకాలంలో వాతావరణంలాంటివాడు ప్రకాశం. ఈ క్షణాన ఎండ. మరు క్షణాన వాన. ఇంతలో దట్టంగా మబ్బులు అంతలో వినిర్మలాకాశం. జడివాన కురుస్తుంటే ఇంక ఈ వర్షం నిలవదేమో ననిపిస్తుంది. ఎండలు కాస్తుంటే ఇంక వానలు లేవేమో ననిపిస్తుంది. ప్రకాశం దాపున వున్నంతవరకూ ఈ ప్రపంచంలోని ఏ శక్తీ అతణ్ణినానుంచి దూరం చేయదనిపించేది. దూరంగా వెళ్ళిపోతే ఆ ప్రకాశం నాకేమీ కాడనిపించేది. ఆశలు, నిరాశలు వెన్నెల్లో వృక్షచ్ఛాయలా అలముకునేవి నన్ను! వెలుగులో చీకటి, చీకటిలో వెలుగు, సంక్రమించిన సిరిసంపదలు, నేర్చుకున్న చదువు, వచ్చిన వయసు, అబ్బిన వివేకం, అలవడిన సంస్కారం దేనిలో పరికించినా కొరత లేనివాడే ప్రకాశం! కానీ, మన సిచ్చిన మగువను అర్థంచేసుకోడానికి మాత్రం అతనికి నిండుగా నాలుగేళ్ళు చాలకపోయాయి. చిట్టచివర ఏ పదా

నికా పదమే విడదీసి టీకా టిప్పణి వివరించుకోవలసి వచ్చింది. వన్యమృగాన్ని మచ్చిక చేసుకునే ప్రసక్తి ఒకసారి ప్రకాశం తెచ్చిందే! ఆ మాట తనకైనా అన్వయించక పోదని ప్రకాశానికి తెలియదేమో పాపం! ప్రకాశం మనసు అదొక చిన్న ప్రపంచంలాంటిదైతే అందులో ప్రణయం ఒకానొక మారుమూల అదొక గండశిలలా పడి వుండిపోయింది. ఆ గండశిలలో నుంచి నేను కోరిన, నాకు నచ్చిన మనోహర శిల్పాకృతి రూపొందే శుభముహూర్తం ఇన్నాళ్ళ కిన్నాళ్ళకు ఈ నాటిరాత్రే పదిగంటల వేళకు కుదిరింది.

ఆ వైనమేమిటంటే...

అమ్మయ్య! ఎక్కడ బయల్దేరిన స్వగతం! ఎన్నెన్ని వైపులకు దీని పరుగు? మళ్ళీ బయల్దేరిన చోటికే తిరిగివచ్చే లోపుగా ఎంతకాలం గడిచింది!

గడచినదానికి చింతించగూడదు. పగ్గాలు బిగబట్టి ఇక దీన్ని ముందుకే నడిపించాలి.

అంతిమ పరీక్షలైపోయాయి. ఎప్పటిలాగే స్వగ్రామానికి వెళ్ళే ధ్యాసలో ఉన్నాడు ప్రకాశం. కంటికి మరుగైన తరువాత ప్రకాశం—చిరునామా లేకుండా టపాచేసివచ్చిన ఉత్తరం!ముంజేతి చిలకే! కాని, ఎగిరిపోతే అడవులన్నీ దానివే! కొంపదీసి ఏ వలలోనైనా తగులుకుంటే? తగులుకోదన్న నమ్మకమేముంది? ఎన్నడూ లేనిది, అన్నయ్యగూడా నా యింగితాన్ని పసిగట్టినట్టే కనిపించాడు. ''అవును ప్రకాశం! నాలుగేళ్లుగా వాయిదాలు వేస్తూ వచ్చావు. ఇంటికి వెళ్లిన ప్రతిసారీ నాన్నగారు 'నీ స్నేహితుడు బాగున్నాడా' అని

అడిగి, 'అతడి నొకసారి తీసుకురాగూడదూ?' అనేవారు. బ్రతికుండగా ఆయన్ను కలుసుకునే ప్రాప్తం నీకు లేక పోయింది. ఇప్పుడైనా మా కోరిక చెల్లించు'' అంటూ గట్టిగా పట్టుబట్టాడు అన్నయ్య.

అమ్మ స్టేషనుకు కారు పంపించింది.

అన్నయ్య డ్రయివరు ప్రక్కన కూర్చున్నాడు. నేనూ, ప్రకాశం వెనుకసీటులో కూర్చున్నాము.

పూత పిందెలతో సౌరభాలు విరజిమ్ముతూ చలువ పందిరిలా పరచుకున్న మామిడిచెట్ల మధ్య జోరుగా పరుగెడుతున్న కారులో కుదుపులేర్పడినప్పుడల్లా క్రీగంట ప్రకాశాన్ని చూస్తూ కూర్చున్నాను. ఉండి వుండి మధుర మధురంగా కూజితాలు చేస్తున్నవి కోయిలలేమో! అవన్నీ ఏకగ్రీవంగా నన్ను అభినందిస్తున్నాయి. కారు సవ్వడి విని యిళ్ళల్లోనుంచీ బిలబిలా బయటికి వచ్చిన అమ్మలక్కలు కారులో కనిపిస్తున్న కొత్త ముఖాన్ని గురించి చేసుకుంటున్న ఊహాగానాలు నా బుద్ధి కందుతూనే ఉన్నాయి. ఎటొచ్చీ అమ్మకు మాత్రం వెయ్యి సందేహాలు! ప్రకాశమంటే యితడేనా ఇందూ!'' అంటూ ఆమె పేరు దగ్గరినుంచీ ప్రారంభించింది. ''బాగానే వున్నాడు గానీ మనిషికా పరధ్యానమేమిటమ్మా ఇందూ!'' అంటూ అంతలో ఒక హంసపాదు పెట్టింది. ''మా బాబాయిగారి మరదలు కొడుకు గోవిందం తెలుసునా నీకు! వాడూ యిలాగే బంగారు బుచ్చినాన్నలా బహు నెమ్మదిగా ఉండేవాడు. వాడేం చేశాడు? ఎవడో తల మాసిన పెద్దమనిషి పిల్లనిచ్చి పెళ్లి చేస్తే, ఆ పిల్ల మెడలో

నగను ఊడదీసుకుని రాత్రికి రాత్రే ఉడాయించేశాడు...''

కాసుకు కొరగాని ఒక ఏబ్రాసి వాడితోనా ప్రకాశానికి పోలిక!

''ఇదిగో ఇందు! మీ అన్నయ్య సిగరెట్లు కాల్చడం బొత్తిగా తగ్గించినట్టున్నాడే!'' అప్పటి కదేదో పరమ రహస్యమైనట్టు దూరంగా తీసుకెళ్ళి అడిగింది అమ్మ.

''అసలు మానేశాడు! ఎలాగైనా సహవాసదోషం కదమ్మా!''

సంతోషమని పేర్కొనదగిన మార్పులేవీ అమ్మ ముఖంలో కనిపించలేదు.

ఆ రోజు రాత్రి భోజనాలైన తర్వాత మరొక విశేషం జరిగింది.

నిద్రపోవడానికి ముందుగా అన్నయ్య ఏకాగ్రతగా ఏదో పుస్తకం చదువుకొంటున్నాడు. తన అలవాటు ప్రకారం ఆఖరు సర్దుబాట్లేవో చూచుకుంటూ యింట్లో ఆవలకు, ఈవలకు తిరుగుతున్న అమ్మ ''ఏం పుస్తకం సురేంద్రా. అంత శ్రద్ధగా చదువుతున్నావు?'' అని ప్రశ్నించింది. ఇల్లలుకుతూ తన పేరు మరచిపోయిన ఈగలా కథలో ఉండి పుస్తకం పేరు మరిచిపోయాడేమో అన్నయ్య ముఖపత్రాన్ని చూచి ''అర్ధరాత్రపు వింత—అయిదు హత్యలు'' అన్నాడు.

''ఆ అయిదు కింకొక సున్న కలపలేక పోయాడా సురేంద్రా! జనాభా తగ్గిపోతుందన్న భయమే లేదే! రచయితలు నిరంకుశులు. వాళ్లు తమకు తోచినట్లల్లా వ్రాసుకోవచ్చును. కానీ అమూల్యమైన కాలాన్ని. ఆరోగ్యాన్ని,

ఎంతో అవసరమైన నిద్రను హత్యచేసే హక్కును వాళ్ళ కెవరూ ప్రసాదించలేదు. ఆ పుస్తకాన్ని దూరంగా గిరవాటు పెట్టలేవా సురేంద్రా!'' అన్నాడు ప్రకాశం.

అన్నాడన్నానుగదూ! అన్న మరుక్షణంలో అన్నయ్య చేతిలో పుస్తకం లేదు. దానికి ప్రకాశం సూచించిన పురస్కారం అక్షరాలా అమలు జరిగింది.

గిరుక్కున వెనుదిరిగి నా దగ్గరికి వచ్చింది అమ్మ. ''ఒకసారి యిలా వస్తావా ఇందూ! నీతో కాస్త వివరంగా మాట్లాడాలి'' అంది.

మౌనంగా వెంబడించాను.

''ఏమిటిదంతా ఇందూ! ఎవరీ ప్రకాశం? ఇతణ్ణి ఆరాధిస్తూ కూచోమని మీ కెవరు చెప్పారు?''

''మంచిని ఆరాధించడం తప్పంటావా అమ్మా!''

''నీ మంచిని తీసుకెళ్ళి గోతిలో పాతిపెట్టు! మంచి ఒక్కటే గాదు మనిషికి కావలసింది...''

''మనిషికి కావలసినవెన్నెన్ని ఉన్నాయో అవన్నీ ప్రకాశానికున్నాయి...''

''బాగుందమ్మా ఇందూ! నీ పరిజ్ఞానం అంతవరకూ వెళ్ళిందన్నమాట!''

''మరైతే ప్రకాశం నిన్నా మొన్నా పరిచయం అయిన వాడా అమ్మా! అన్నయ్యకు, ప్రకాశానికి స్నేహం ఈ నాటిది కాదు....''

"కాదనను. బాగా ముదిరిన తర్వాత రోగం నయం కావడం కష్టమే!"

ఏడుపొచ్చింది నాకు! ప్రకాశం పట్ల అమ్మకు సదభిప్రాయం ఏర్పడకపోవడం చాలా ఆశ్చర్యకరమైన విషయం. తన ఆమోదముద్ర లేందే ఈ యింట్లో పూచిక పుల్లయినా కదలడానికి వీల్లేదన్న స్వాతిశయం ఆమెకు పూర్తిగా ఉందని నాకు తెలుసు. ఐతే మాత్రం? ఇది నా జీవితానికి సంబంధించిన సంగతి. ఇందులో నే నొకరి జోక్యాన్ని సరకు చేయాల్సిన అవసరం మాత్రం ఎక్కడుంది?

చివాలున పైకి లేచి గదిలో నుంచీ వెలుపలికి వచ్చేశాను.

ఇలాంటి పరిస్థితిలో నాన్నగారు ఉంటేనా—అన్న భావం మనసులో మెదిలిందేమో, లోలోపల దుఃఖం కట్టలు త్రెంచుకుంది. సరోవరంలో నీటి బుడగల్లా, చీకటి గదిలో నా వెక్కిళ్ళు నాకే వినిపిస్తున్నాయి. అలా ఎంతసేపు రోదించానో తెలియదు. చెంపకు చల్లగా ఏదో తగలడంతో ఉలికిపడి తల పైకెత్తాను. మంచం దగ్గర ఓ ఆకారం! పోల్చుకున్న క్షణంలో ఆ చేతిని దూరంగా విసిరికొట్టాను. ఏడ్చింది చాలక మళ్ళీ ఆవిడ నా గదిలోకి ఎందుకొస్తుంది?

మంచంపైన నా ప్రక్కనే పడుకుంది అమ్మ. "పిచ్చి ఇందూ! ఇప్పుడు నేనేమన్నానని! ఈ మాత్రానికే యిలా ఏడుస్తూ కూచుంటారా ఎవరైనా తప్పుకదూ!" అంటూ నన్ను దగ్గరగా మరీ దగ్గరగా పొదివి కడుపులోకే తీసుకుంది.

ఆ ఓదార్పు నా దుఃఖాన్ని రెచ్చగొట్టడానికి మాత్రమే తోడ్పడింది.

"వెర్రిదానా! నీ మొగుణ్ణి నువ్వు ఎన్నుకోరాదని ఏ శాస్త్రమూ చెప్పదు. కానీ, నా అల్లుణ్ణి నేను ఎంచుకో గోరడం కూడా తప్పుకాదు గదా! నీకు మరో రహస్యం చెప్పనా ఇందూ! మనం ఆడపెళ్లివాళ్ళం. మనంతట మనం ముందుబడి అవతలి వాళ్ళకు లోకువ గావడం ఏమంత బాగుంటుంది చెప్పు...వివాహ ప్రసక్తి ఎప్పుడూ వరుడి వైపు నుంచీ రావడం మంచిది..."

"నీకు తెలియదమ్మా! చెప్పరానంత బిడియం ప్రకాశా నికి! అతడు తనంతట తానుగా ఈ విషయాన్ని నీ దగ్గర ప్రస్తావించలేడు..."

"సరేనమ్మా ఇందూ! నువ్వప్పుతే ప్రకాశం తరఫున వకాల్తా పుచ్చుకుంటే నేనేం చేయగలను! పోనీలే...నేనే అతణ్ణి కదిపి చూస్తాను..."

ఎలా కదుపుతుంది? కదిపితే అదిరిపడడా ప్రకాశం! ఆమోదం వెలిబుచ్చడా? ఆనందంలో తబ్బిబ్బులై పోడా!

మరునాటి రాత్రి పది గంటలదాకా నా హృదయం హృదయమంతా ఉత్కంఠకు విహారస్థలమై పోయింది.

తెల్లవారింది మొదలు, ప్రొద్దుపోయిచీకటిపడి ఊరంతా మాటు మణిగేదాకా యింట్లో జనసంచారం తగ్గదు. ఒక రితో ఒకరు ఏకాంతంగా మాట్లాడుకోవడానికి అవకాశం లభించదు. అలాంటి ఏకాంత సమయంకోసం వేచి చూస్తోన్న అమ్మ తాంబూలపు పళ్ళెరంతో సహా హాల్లోకి వెళ్ళింది.

"వక్కలూ. ఆకులూ నమిలే అలవాటు లేదా ప్రకాశం?"

"విద్యాభ్యాసం పూర్తయ్యేదాకా తాంబూలం వేయగూడదటమ్మా!" అన్నయ్య సమాధాన మిచ్చాడు.

"విద్యాభ్యాస మెలాగూ పూర్తయింది. అదీ యిక మీదట చెప్పవలసిన సాకుగాదు. తాంబూల చర్వణాన్ని పెళ్ళిదాకా వాయిదా వేస్తాడేమో ప్రకాశం! అవునా ప్రకాశం?"

ప్రకాశం నవ్వాడు.

"తాంబూలం వేసుకోవడం అష్టభోగాల్లో ఒకటట! మిగిలిన భోగాలేవో నాకు తెలియదుగానీ, పెళ్ళి చేసుకోడం, కొత్త భార్యతో సుఖించడం భోగాలన్నిటిలోకి మకుటాయమానమైన దంటారు. నువ్వు త్వరగా పెళ్లి చేసుకోవా ప్రకాశం?"

"నీది మరీ చాద స్తమమ్మా! పెద్దవాళ్ళు పూనుకుంటే. పిన్న వాళ్ళు చేసుకోక ఏం చేస్తారు?"

"నువ్వూరుకో సురేంద్రా! పెళ్ళిమాటెత్తితే నువ్వు ముందుగా లేచి కూర్చునేటట్టున్నావు..."

"కానీ, నన్నెవరూ ప్రేమించ లేదుగా!"

ఉలికిపడ్డట్టున్నాడు ప్రకాశం! భావగర్భితమైన చూపులతో అతడు అన్నవైపు చూస్తున్నాడు.

"ఏమంటావు ప్రకాశం?" అమ్మ ప్రశ్నిస్తోంది.

"ఏం చెప్పమంటారు?"

చర్చకు చెవు లప్పగించి తెర వెనుక కూర్చున్నాను.

చర్చ దారి తప్పుతుందేమోనని నా అనుమానం! గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

"మా అమ్మాయిని నువ్వు నాలుగేళ్ల నుంచీ ఎరుగుదువు! ఆమెగూడా ఓపినంతలో నిన్ను అర్థం చేసుకోగలిగి ఉంటుందనే నా ఉద్దేశం. ఆడబిడ్డకు తల్లినిగా నేను మీ అభిప్రాయం తెలుసుకో గోరడం సబబుగాకపోదు. ఇలాగే మీ వాళ్లకూ నీ పెళ్లి విషయంలో మక్కువ ఉండనే ఉంటుంది. వాళ్ళొకసారి యిక్కడికి వచ్చి వెళ్ళినా సరే!"—చిరునవ్వుతో ముగించింది అమ్మ—"లేదా మమ్మల్ని ఒకసారి అక్కడికి రానిచ్చినా సరే!"

"వాళ్ళెలాగూ రానే వస్తారు. ఆ లోపల మనమే వెళ్ళి రాగూడదటమ్మా!"

"ఏదీ ప్రకాశం చెప్పడే ఆ మాట!"

"మౌనమే అర్ధాంగీకారం!"

"ఆ మాత్రం బెట్టు మనకెందుకు లేకపోవాలి? పూర్ణాంగీకారం లేనిదే మనం కదలం..."

"బుద్ధ విగ్రహంలా అలా కూర్చున్నావేం ప్రకాశం! చెప్పవయ్యా బాబూ చంపక!"

"ఏదో చెప్పమంటున్నారు గానీ యిది మాటలు స్ఫురించే సమయమేనా సురేంద్రా! ఎన్నో విషయాలు చెప్పాలని ఉంది. కానీ, ఏమని చెప్పను! ఎలా చెప్పను? ఏ విధంగా చెప్పి మెప్పించను! పోనీ సంగ్రహంగా సారాంశాన్ని ఒక్క మాటలో చెప్పనా సురేంద్రా! ఇందుబాలను చేబట్టే అదృష్టం నన్ను వరిస్తుందని నేను కలలోనైనా అనుకోలేదు..."

"ఈ మాత్రానికి ఎంతదూరం సస్పెన్సు పొడిగించావయ్యా మహానుభావా!" మంచంపైకి వాలిపోయి నిద్రకు ఉపక్రమణికగా శాలువా కప్పుకున్నాడు అన్నయ్య.

అమ్మ వాలకాన్ని బట్టి చూస్తే ఆమె యిప్పుడప్పుడే ప్రకాశాన్ని వదిలిపెట్టేటట్టు లేదు. ఏదో లోకాభిరామాయణం ముచ్చటిస్తూ అక్కడే కూర్చుంది.

నా మట్టుకు నేను మాత్రం నిశ్చలంగా కూర్చోలేకపోయాను. లేచి నా గదిలోకి వచ్చాను. లైటు వేశాను. కిటికీ తెరిచాను. రేడియో ట్యూన్ చేశాను. కాసేపు అద్దంలో సుద్దులు చూసుకున్నాను.

ఆఖరికి పడుకున్నాను.

పడుకున్నానే గానీ నిద్రపట్ట లేదు...

అస లింతకూ నిద్ర పట్టదనే అనుకున్నాను గానీ, నిద్రకూ, జాగరణకు జరిగే పోటీలో తెల్లవారు జామున నిద్రా దేవతే పైకొంటుందని నేనేమైనా కలగన్నానా! ఎప్పుడొచ్చిందో, ఏ దారి గుండా వచ్చిందో మాయలమల్లి లాంటి నిద్రా దేవత రానే వచ్చింది. నా ఎరుక లేకుండా నాపైన ఇంత మచ్చుపొడి చల్లనే చల్లింది!

* * *

"ఇంకా లేవ లేదా ఇందూ!...ఇదేం మొద్దు నిద్రే తల్లీ! ప్రొద్దు మధ్యాహ్నం మాతున్నా యింకా నిద్రేనా..."

అమ్మ మేలుకొలుపులు కలలోని అంశాల్లా వినిపిస్తున్నాయి. మగత నిద్దుర తెరలు పూర్తిగా విచ్చి కళ్లు తెరిచే

సరికి గడచిన రాత్రి తాలూకు చల్లటి వెన్నెలకు బదులుగా యిప్పుడు వెచ్చని నీరెండ లోకాన్ని ముంచెత్తుతోంది.

ఎవరో నా చేతిని పట్టుకుని బిరబిరా లాక్కెళ్తున్నట్టుగా హాల్లోకి వెళ్ళాను.

మంచాలు రెండూ ఖాళీగా ఉన్నాయి.

"అన్నయ్య తోటలోకి వెళ్ళాడా అమ్మా?" అమ్మనడిగాను.

ఎందుకో అమ్మ డబ్బాలో గులకరాళ్ళను కదిలించినట్టుగా గొల్లున నవ్వింది.

"మంచి పరామరికే! ఎలాగైనా అన్నగారిపైన చెప్పరానంత అక్కరే చెల్లెలికి! తోటలోకే వెళ్ళినట్టున్నారు. వచ్చేస్తారు గానీ నువ్వు ముఖం కడుక్కోవమ్మా ఇందూ!"

దంతధావన ముఖప్రక్షాళనాదిక కాలకృత్యాలు నిర్వర్తించి వేడివేడిగా కాఫీ చవిచూస్తున్నాను.

పాదరక్షలు కిరకిర లాడుతుండగా అన్నయ్య లోపలికి వచ్చాడు.

"మధుపానమా ఇందూ! ఉపాహారం సంగతేమిటి? నువ్వూ ప్రకాశమూ కలిసి నాకేమైనా మిగిలించినట్టా, లేనట్టా?"

"ఇదేం చోద్యంరా సురేంద్రా! ప్రకాశం యెక్కడెక్కడున్నాడు? నీతో కలిసి తోటలోకి రాలేదా అతడు?"

"ఇది మరీ బాగుంది. నే నింట్లో ఉన్నాడనుకోడం, మీరు తోటలో ఉన్నాడనుకోడం! భలే దాగుడుమూతలే ఆడుతున్నాడు ప్రకాశం! నేను నిద్ర లేచేసరికే మంచం

పైన లేదు. నేనూ మీలాగే వనవిహారం చిత్తగించాడేమో ననుకున్నాను. తీరా వెళ్ళి చూస్తే అక్కడా కనిపించడే! వేరేదారిగుండా యింటికి తిరిగి వచ్చాడేమో ననుకుంటే యిక్కడా అయిపు లేదు..."

"అతడంతేనమ్మా! ఇంటివైపు మళ్ళించేవాళ్ళు లేక పోతే అలాగే పొలాల గట్లమ్మట తిరుగుతూ ఉండి పోగలడు..."

"అలాగని మేము గూడా పొలాల గట్లు సర్వే చేయాలంటావా ఇందూ! మా వల్లగాదు. అంతగా తోడు అవసరమనిపిస్తే నువ్వే వెళ్ళచ్చు."

"బిడ్డనలా ఉడికిస్తావేంరా సురేంద్రా!" అంటూ నన్ను వెనకేసుకొచ్చింది అమ్మ—అప్పటికి నన్ను ఉడికించడంలో తానేమో వెనకబడినట్టు!

అన్నయ్య ఆవురావురంటూ టిఫినుపైన పడ్డాడు.

నాకు మాత్రం కాలొకచోట నిలవడం లేదు.

వసారాలో ముసలి డ్రయివరు రామయ్య కనుపించాడు. కదిలితే కారు, వదిలితే యిల్లు. మరొక ప్రపంచం లేదతనికి. ప్రకాశం జాడ అతనికి తెలిసేవుంటుంది బహుశా! అడిగి చూచాను.

"ప్రకాశంగారా అండీ చిన్నమ్మగారూ! తెల్లారినప్పటి నుంచి కనిపించనే లేదే!" అన్నాడు ఆశ్చర్యంతో ముఖాన్ని మరింత వెడల్పుగా జేసి చూపెడుతూ రామయ్య.

పొలంనుంచీ వచ్చిన పెద్ద పాలేరు గూడా అంతకన్నా వివరాలు చెప్పలేకపోయాడు.

"ఆ అబ్బాయిగోరేనా చిన్నమ్మగారూ! నిన్న మాపటాల కనబడ్డమే కనబడ్డం. మళ్ళీ యివాల్టిదాకా కనపల్లా!"

అయినవాళ్ళు, కానివాళ్ళూ అందరూ కలిసి నా పైన కుట్ర బన్నుతున్నారేమో ననిపించింది. ప్రకాశాన్ని ఎక్కడో దాచిపెట్టి వీళ్లందరూ సమిష్టిగా ఓ కపటనాటకం ఆడుతున్నారేమో!

ఇంతలో తన కెవరో బొట్టూ, కాటుకా పెట్టి పిలిచినట్టు దగ్గరగా వచ్చి ఉచితంగా ఓ సలహా యిచ్చేశాడు రాఘవయ్య.

"ఈ కాలం ఎవరినీ నమ్మడానికి వీల్లేదండీ చిన్నమ్మగారూ! ఏ పుట్టలో ఏ పాముంటుందో ఎవరికి తెలుసు? ఎందుకైనా మంచిది. పెట్టెలు అవీ పదిలంగా ఉన్నాయో లేదో చూచుకున్నారా?"

ఆ ముసలివాణ్ని నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది.

నేలబారు చూపుల వాళ్ళకు ఔన్నత్యాలు అర్థం గావు. వీళ్ళ దగ్గర ఈ ప్రస్తావన తేవడమే తప్పు.

గిరుక్కున వెనుదిరిగి లోనికి వచ్చేశాను.

"స్నానం చేస్తావా ఇందూ!" అమ్మ పరామర్శ.

సుష్టుగా దాణా భోంచేసి అన్నయ్య దినపత్రిక తిరగవేస్తున్నాడు.

గందరగోళమంతా నా ఒక్కదానికి మాత్రమే మిగిలింది! నిక్షేపంలాంటి మనిషి కనిపించడంలేదంటే ఇక్కడెవరికీ చీమ కుట్టినట్లయినా లేదు.

అలాంటివాళ్ళ ముఖాలు చూస్తూ అక్కడెలా కూర్చోను?

గదిలోకి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను.

ఏ పాపిష్ఠి ముహూర్తాన అన్నాడో గానీ, ఆ ముసలి రాఘవయ్య మాటలు బుర్రలో గింగుర్లు తిరుగుతున్నాయి.

పెట్టెలు పదిలంగా చూచుకోవాలిట!

పట్టణంనుంచీ మేము తెచ్చుకున్న పెట్టెలు నన్ను చూచి నవ్వుతున్నట్టున్నాయి.

అదిగో అదే ప్రకాశం ట్రంకు. పెట్టె యిక్కడే వుండగా మనిషేమౌతాడు?

దానికి ప్రక్కనున్న ట్రంకే...నా...ది...

దానిపైకి చూపులు ప్రసరించిన క్షణంలో శరీరంపైన తేళ్ళు, జర్రులు ప్రాకినట్టయి తటాలున లేచి నిల్చున్నాను.

వేసినతాళం వేసినట్టే ఉండగా ఎవరో కొక్కాన్ని వూడదీసేశారు.

ఎవరు? ఎందుకు? ఎప్పుడు?

కంపిస్తున్న చేతులతో మూతను పైకెత్తాను.

పుస్తకాలు, బట్టలూ నేను సర్దిపెట్టినట్టుగా లేవు.

ఇంట్లో ఎన్నో పెట్టెలుండగా నా పెట్టెలో ఎవరికే వస్తువులు కావలసి వచ్చాయి?

చీరలు, జాకెట్లు, పుస్తకాలు, ఫోటోలు మినహాగా నా పెట్టెలో మరేమున్నాయి?

బట్టలు పైకి తీశాను. పుస్తకాలు నేలపైన విసిరాను.

ఉండవలసిన వస్తువులన్నీ ఉన్నట్టే ఉన్నాయి.

కాని చౌర్యం జరగడానికి ఉద్దేశమంటూ ఒకటి ఉండక తప్పదు.

ఏమిటది? ఏమై ఉంటుందది?

వస్తువులన్నీ వెలుపలికి దీయగా ట్రంకు అట్టడుగున చందనం పెట్టె ఒక్కటే మిగిలింది.

అందులోనైనా దొంగకు కావలసిన వేమున్నాయన్న తలపోతతో ఆ పెట్టెను పైకి తీశాను—తెరిచి చూచాను.

విద్యుదాఘాతం తిన్నట్టుగా ఎక్కడైతే కూర్చు న్నానో అక్కడే స్తంభించిపోయాను.

చందనం పెట్టెలో ప్రేమలేఖలు లేవు.

ప్రాణప్రదంగా, ప్రాణాధికంగా చూచుకున్నవీ, ముత్యాల కోవలాంటి చక్కని దస్తూరితో ప్రకాశం వ్రాసినవీ. మోసి తెచ్చిన మంచి గంధంలాంటి ప్రణయంతో ఒడలికి గిలిగింతలు పెట్టి పులకింతలు కలిగించినవీ అయిన నా ప్రేమలేఖలపైన మోజుపడే దొంగవాడెవడై ఉంటాడు?

చుట్టూరా చెలరేగుతున్న తుఫాను అమ్మ తీసుకొచ్చిన వర్తమానంతో చివరి ఘట్టంలోకి చేరుకుంది.

"ఇందూ, ఇందూ! ఓసి పిచ్చిదానా! ఈ సంగతి విన్నావా! తెల్లనివన్నీ పాలు కావంటే నమ్మావా? మన గొడ్లను తోలుకెళ్ళే నారిగాడు లేడూ, వాడు చెప్పగా తెలిసింది. ఆ ప్రకాశమన్న పెద్దమనిషి రోడ్డులో ఉదయం ఆరు గంటల బస్సెక్కుతుండగా నారిగాడు స్వయంగా తన కళ్లతో చూచాడట!"

# 2

బస్సు పరుగిడుతోంది.

బస్సు ముందుకు దూసుకపోతున్నకొద్దీ మనస్సు మాత్రం వెనక్కే పరుగిడుతోంది.

మంత్రాలన్నిటిలోనూ పలాయనమంత్రం పఠించడం చాలా సులభం! కానీ, దేనినుంచీ మనిషి పలాయనం చిత్తగిస్తున్నాడో దానినుంచీ మనసును వైదొలగించుకోడం దాదాపుగా అసంభవం.

ఉదయం నే నెక్కడైతే బయల్దేరానో అక్కడ ఈ పాటికి నా పైన నేరారోపణ ప్రారంభమై ఉంటుంది.

సంజాయిషీ చెప్పుకోవలసిన ప్రకాశం బస్సులో కూర్చుని క్షణక్షణానికి దూరంగా పారిపోతున్నాడు.

నా నేరం చట్టాలకు దొరకనిది. పోలీసులు ఋజువు చేయలేనిది. న్యాయస్థానాల శిక్షాస్మృతులకు లొంగనిది. కాని ఆ మాటకొస్తే రాజ్యాంగ సూత్రాలకు లోబడి నడుస్తున్న న్యాయస్థానాలేనా న్యాయస్థానాలు? వీటి కన్నింటికీ పైన భగవంతుడి న్యాయస్థానం ఒకటి ఉందని చెబుతారు. ఊహకు మాత్రమే అందే ఆ న్యాయస్థానం మాట కేమిగానీ, ఎవరి మనసు వారి కొక న్యాయస్థానంగా ఉపకరిస్తూవుండటం, తేలిగ్గా త్రోసివేయడానికి వీల్లేని నగ్నసత్యం. వాదిగా, ప్రతివాదిగా, న్యాయమూర్తిగా బహురూపాలు ధరించి నేరాన్ని ప్రతిపాదించి, నిరూపించి ప్రతివాది పరోక్షంలోనే తీర్పులు చెప్పే విచిత్రమైన న్యాయస్థానం మనస్సు.

ఇందుబాలకు, సురేంద్రకు ఈ నూతన పరిణామం యొక్క స్వరూప స్వభావాలు ఇంకా తేటతెల్లంగా అవగతమై వుండక పోవచ్చు. కానీ, అనసూయమ్మ మాత్రం తన న్యాయస్థానంలో ఈ పాటికి నాకోసం ఒక బోను తయారుచేసి వుంటుంది. అందులో నన్ను నిలిపి దగాకోరుననీ, విశ్వాస ఘాతకుడననీ, నయవంచకుడననీ నాపైన నేరం ఆరోపిస్తుంది...

తప్పిదం చేయలేదని బూకరించడం చాలా సులభం. కానీ ఈ పరిస్థితిలో నేనలాంటి వాదానికి పాలుమారడం అగ్గిపైన గుగ్గిలం చల్లడం!

వాస్తవాన్ని వెల్లడిస్తే నిజంగా నేరం చేసినవారు దండనకు లోబడవలసివస్తుందన్న బెంగతో వుత్త పుణ్యానికి చేయని నేరాన్ని చేసినట్టు ఒప్పుకుని శిక్షాస్మృతికి బ్రతుకును బలిగావించే వుదంతాలు కొన్ని కనీ,వినీ వున్నవే! ఇలాంటి పెద్ద తరహా త్యాగాన్ని అభినయించడానికైనా నేను సిద్ధంగా లేను.

మనిషి అంతరంగానికి సంబంధించినంతవరకు మనసే ఆఖరు న్యాయస్థానం గాదు. దానికి పైది అంతరాత్మ. దానికైనా నేను సమాధానం చెప్పుకోక తప్పదు.

తప్పిదం చేయలేదా నేను? చేశాను.

అబ్బే, నేను చేసింది తప్పిదమా? కాదు.

మొండి ప్రకాశానికి ఎదురైన ధర్మసందేహం నాటుపెట్టినా పగలని బండరాయి లాంటిది.

చివరి కొక్కటే గత్యంతరం మిగిలింది—గడచిన గాథనంతా త్రవ్వి తలకెత్తుకోడం!

నాలుగేళ్ళ క్రిందటి సంగతి.

పూలతోటల మధ్య, పచ్చికమైదానాల పొంత సరస్వతీ సామ్రాజ్యానికి వారసత్వం కోరివచ్చిన వందలకొలది విద్యార్థుల సంచారంతో కలకలలాడుతున్న కళాశాల ప్రాంగణం—

స్వరాజ్యం తన జన్మహక్కన్నాడు తిలక్ మహాశయుడు. జీవించడం తన జన్మహక్కుగా తలపోస్తున్నాడు నేటి సామాన్య పౌరుడు. కేవలం జీవిస్తే చాలదు. విద్యావిహీనుడు మర్త్యుడే కాదు పొమ్మంటాడు భర్తృహరి. నాగరిక దేశాల్లో వ్యక్తి మాత్రుడి కెవరికైనా సరే. చదువుకునే హక్కు నిషిద్ధంగాదు. కానీ హక్కున్న మాత్రాన చాలదు. అవకాశ ముండాలి. అవకాశముంటే చాలదు. తెలివితేట లుండాలి. అంతటితో సరిపోదు. శ్రద్ధగూడా అవసరం!

పై మూడు కవాటాలను తెరుచుకుంటూ వెళ్తేగానీ చదువుల తల్లి దర్శనం లభ్యంగాదు.

ఆ మూడింటిలోనూ ఓ కవాటాన్ని తెరిచే తాళం నా దగ్గర లేదు.

మనదగ్గర లేని దేదైతే ఉందో దాన్ని మరొకరిదగ్గరి నుంచీ పుచ్చుకుని, అందుకు వినిమయంగా వారి దగ్గర లేని దేదైతే వుందో దాన్ని వాళ్ళకు ఇచ్చుకోడం వ్యవహారపద్ధతి.

ఈ వినిమయ విధానంలో సురేంద్రకు సన్నిహితుణ్ణి కావలసిన అవసరం నా కేర్పడింది.

అందువల్లనే కళాశాల ప్రాంగణంలో నా చూపులు సురేంద్రకోసం వెదకుతున్నాయి.

సన్నగా ఎర్రగా బంగారు శలాకలాంటివాడు సురేంద్ర. మాయని, నలగని దుస్తులతో అలాగే పోతబోసి తయారుచేసి నట్టున్న సజీవ విగ్రహంలా వున్నాడతను. లేబొరేటరీ కల్లంత దూరంలో ఓ గంగరావిచెట్టు. చెట్టు క్రింద నిల్చుని హేలగా సిగరెట్టు కాలుస్తున్నాడు సురేంద్ర. చుట్టూరా అతడిలాంటి యువకులే మరికొందరు.

అడ్మిషన్లు ముగిశాయి. మిత్రపరివేష్టితుడై కాలేజి ఆవరణలో బాతాఖానీ వేస్తున్న సురేంద్రను, మిత్రబృంద సమేతుడై నగరవీథుల్లో షికార్లు కొడుతున్న సురేంద్రను చాలాసార్లు చూచాను—ఓ వ్యక్తి తనను నీడలా వెన్నంటుతున్నాడన్న విషయం అతనికి తెలియదు.

ఎలాగైనా చొరవచేసుకొని సురేంద్ర మిత్రమండలి లోనికి జొరబడగలిగితేగానీ నేనతనికి హితుణ్ణి, సన్నిహితుణ్ణి కాలేను.

లోకంలో సమాజాలు, సంస్థలూ దండిగా వున్నాయి. దేనిలో చేరాలన్నా ఎంతో కొంత ప్రవేశ రుసుము, ఏవో కొన్ని నియమాలు వుండనే వుంటాయి. సురేంద్ర మిత్ర వర్గంలో సభ్యత్వం పొందడానికి చెల్లించుకోవలసిన రుసుము కొద్దిపాటిది. గుక్కపట్టి పొగ పీల్చడం, పీల్చిన పొగను గుప్పు గుప్పున బయటికి వదలడం, గుప్పెడు ధూమాన్ని మింగినా కిక్కురుమనకుండా వుండగలగడం-యింతమాత్రం చాలు. పోగా నిర్దిష్టంగా పేర్కొనబడిన నియమావళిలాంటి దేమీ లేదు గానీ కనీసపు షరతులు కొన్ని లేకపోలేదు. లౌకికమైన కట్టుబాట్లు కన్నింటికీ అతీతంగా, తాము ఈ

లోకంకోసం కాదనీ, తమకోసమే ఈ లోక మున్నట్టుగా, హోటలుకు వెళ్ళినా, సినిమాలో కూర్చున్నా రోడ్డుపైన నడుస్తున్నా విశృంఖలంగా వ్యవహరించడం ఒకటి. సినిమా తారల వయో రూపగుణ విశేషాలను గురించి తుణ్ణమైన పరిజ్ఞానం కలిగి వుండటం మరొకటి. ఏదో విశ్రాంతి కేంద్రంలో హాయిగా కాలం వెళ్ళదీస్తున్నట్టు భావించా లంతేగానీ, చదువుపైన అట్టే పట్టింపు పెట్టుకోగూడదు. వీటి కన్నింటికి తలమానికమైన నిబంధన చివరిది—డబ్బును డబ్బుగా గణించడం మహాపచారం! అచ్చుకొట్టిన కొన్ని చదరపు టంగుళాల కాగితాలకు పెద్దగా విలువయిచ్చి పెట్టెల్లోనూ, పర్సుల్లోనూ వాటిని పదిలంగా వుండనివ్వడం తమ వ్యక్తిత్వానికే కళంకాన్ని ఆపాదించే సంగతి. పాపం, ఈ పాడు డబ్బుతో ఎవరెవరికి ఎన్నెన్ని అవసరా లుంటాయో మన కేం తెలుసు? కనుక దీన్ని సినిమావాళ్ళకు, హోటలు యజమానులకు, టాక్సీ వోనర్లకు, ఇంకా ఆశించిన వాళ్ల కందరికీ తలా కొంచెం పంచిపెట్టడం మంచిది...

పై షరతులు నాకు నచ్చవని చెప్పడం తెగబడి డాబులు చెప్పుకోడమే అవుతుంది. అంతకన్నా ఆ షరతులకే నేను నచ్చనని చెప్పుకోడం సత్యానికి సమీపస్థంగా వుంటుంది. పోనీ కొంతకాలంపాటు నా నడవడిని అలా మార్చుకోగలిగితే బాగుంటుందేమో నన్న ఆలోచన సైతం కలుగకపోలేదు. సురేంద్ర సాహచర్యంకోసం నే నెలాంటి కృత్రిమ ప్రవర్తనకైనా సిద్ధపడే వున్నాను. కానీ అందువల్ల తప్పనిసరిగా సత్ఫలితం కలుగుతుందన్న నమ్మకం లేకపోతే,

నేను పప్పులో కాలు వేసినవాడి నవుతాను. నా ధ్యేయానికి అభిముఖంగా నడుస్తున్నవాణ్ణి కాలేను.

మరైతే నా కర్తవ్యం?

ఎలాగైనా సురేంద్రను మిత్రుల పద్మవ్యూహంలో నుంచీ తప్పించాలి. అప్పుడది నా భావి కార్యక్రమానికి నాంది మాత్రమే అవుతుంది. బంజరుభూమి వున్నదున్నట్లుగా సాగుబడికి లాయకీ కాదు. చుట్టూ కంచె వేయాలి. మిట్ట పల్లాలు చదును చేయాలి. నీరు పెట్టాలి. భూమిని కదల దున్నాలి. ఆ తరువాత పని బీజారోపణ—చదువుకోవాలన్న ఆశయం సురేంద్రకైతే బొత్తిగా లేకపోవచ్చు. కానీ అతడు చదువుకోవలసిన అవసరం నాకు మాత్రం గట్టిగా వుంది.

ఆరు నూరైనా, నూరు ఆరైనా నేను సురేంద్రను నా వైపుకు ఆకర్షించుకోవాలి. ముకుదాడుకు పగ్గంవేసి ఆ కోడె దూడను గూటానికి బిగించాలి.

ఎలా సాధ్యం?

ఒకవ్యక్తి మరోవ్యక్తిచేత ఆకర్షితుడు కావాలంటే, అందుకా రెండో వ్యక్తిలో ఏదైనా ప్రత్యేకాకర్షణ అవసరం!

నాలో ప్రత్యేకాకర్షణ ఏముంది?

నా నిజస్వరూపం సురేంద్రకు నచ్చదని నాకు బాగా తెలుసు.

నచ్చకపోవడం అటుండగా, దాన్ని సురేంద్ర దరి జేర నివ్వకపోవడమే సంభవం!

కనుక ఏ విధంగా చూచినా నా కింక తెచ్చికోలు ఆకర్షణ ఒకటే శరణ్యం?

ఛద్మవేషానికి హంగులు సమకూర్చుకోసాగాను. పాత్రధారణకు రంగులు సిద్ధపరచుకోసాగాను.

అనతికాలంలో రంగం దానంతటదే తయారైంది.

కాకేం చేస్తుంది.

ఊరికంతా ఒకదారి కాగా, తనకు మాత్రం ఒక దారిని చూచుకునే ఉలిపికట్టెకు కూడా ఓ ప్రత్యేకత లభిస్తోంది. మౌనమే కిరీటంగా ఏకాకితనమే అంగరక్షకుడుగా ఏవో ప్రశాంత గంభీర సామ్రాజ్యాలకు యౌవరాజ్య పట్టాభిషిక్తుడిలా కూర్చున్న నాలో ప్రత్యేకత కనిపించిందంటే అందులో విడ్డూర మేముంది?

గుసగుసలు ప్రారంభమయ్యాయి.

ఎవరితను? ఎక్కడి నుంచీ వచ్చాడు?ఎందుకు మనుషులతో కలసి మెలసి ఉండడు? ఏమిటబ్బా యీ వాలకం?

నిగూఢమైన విషయంలో ఏదో రహస్యం దాగి ఉందనుకోడం లోకంలో పరిపాటి. నాలోనుంచీ అలాంటి రహస్యాన్ని వెలికిలాగే ప్రయత్నంలో ప్రశ్నలవర్షం కూడా ఆయత్తమైంది.

ఆత్మస్తుతి క్రిందికి రాకపోతే ఆ అవకాశాన్ని సైతం నేను సద్వినియోగం చేసుకున్నాననే చెప్పవచ్చు.

నిజవృత్తాంతానికి, నిజస్వభావానికి అందమైన బురఖాలు తొడిగి, ఆ విధంగా వ్యక్తిత్వానికొక విశిష్టతను సంతరించుకోడం పెద్ద ఘనకార్యమేమీ కాదు. ఆవ రేజి తెలివితేటలున్నవా రెవరైనా అలాంటిపని అశ్రమంగా చేయవచ్చు. క్రొత్తప్రదేశమైతే అందుకు మరీ అనువైనచోటు. పాదాలు

నేల కానుతున్నట్టుగాకుండా, నాలుగడుగుల ఎత్తున గాలిలో నడచిపోతున్నట్టుగా కనిపించాలి. లోకు లందరూ ఆసక్తి కనబరచే విషయాలపట్ల తన కెంతమాత్రము ప్రసక్తి లేనట్టు వ్యవహరించాలి. డబ్బును గురించిన అవసరంగానీ, దానికి సంబంధించిన విలువగానీ తనకెప్పుడూ కాబట్టనట్టు ప్రవర్తించాలి. తగు జాగ్రత్తతో ఈ నియమాలను పాటిస్తే అనతి కాలంలో వ్యక్తిత్వం చుట్టూ పొగమంచులాంటి వైచిత్రి ఒకటి అలుముకుంటుంది.

మొదటిరోజున క్లాసులో ప్రక్కవారి గుర్తింపుకైనా పాత్రుణ్ణి కాలేకపోయిన నేను, నెలరోజుల్లో అపురూపమైన వ్యక్తినిగా పరిణమించాను. నా వాలకం, ప్రవర్తన, స్థితి గతులు కుతూహలజనకమైన చర్చావిషయాలుగా పరిణమించాయి—అనగా నా పూనిక జయప్రద మౌతోందన్న మాట! అంతలో నా స్నేహంకోసం సురేంద్ర ప్రలోభ పడడం గూడా ప్రారంభమైందంటే, అందు కంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

ఒక మంచి స్నేహితుణ్ని ఎన్నుకున్నానని సురేంద్ర వాళ్ళ నాన్న గారికి జాబు వ్రాసి నాకు చూపించి నప్పుడు లోలోపల జాలిగా నవ్వుకున్నాను-ఎన్నుకున్నది అతడు గాదు.

నాలుగేళ్ళ కళాశాల జీవితంలో నేనూ, సురేంద్ర ఓ గది గోడల మధ్యలోకి రావడంతో రెండో అధ్యాయం ప్రారంభమవుతుంది.

సురేంద్ర మానసిక ప్రపంచంమీద ఆధిపత్యం కోసం నేను తీవ్రంగా ప్రయత్నిస్తున్న రోజులవి. కొన్ని అదనపు

బాధ్యతలను స్వీకరింపవలసి వచ్చినప్పుడు మానవుడు తన స్వంత అవసరాలు కొన్నింటిని గమనించడం మానుకోవలసి వస్తుంది. ఈ వినిమయ విధానంలో నేను నా బాహ్యావసరాలను గమనించుకునే బాధ్యతను సురేంద్రకు అప్పజెప్పడం జరిగింది. అతడు లేవమంటే లేచేవాణ్ణి. కూర్చోమంటే కూర్చొనేవాణ్ణి! భోజనానికి వేళయిందంటే, సరే, కానిద్దామనేవాణ్ణి. స్నానం చేసి రమ్మంటే చేసేవాణ్ణి, అలా లౌకిక వ్యాసంగాల్లో నేను ప్రకటించిన అర్భకత్వం మొదట సురేంద్ర ఆశ్చర్యానికి, తరువాత అతడి సానుభూతికి పాత్రమైంది. తాను లేకపోతే ఈ మహానగరంలో ప్రకాశం ఏమయ్యేవాడోనన్న దిగులు అతనిలో బలపడింది.

సురేంద్రలో ఆత్మాధిక్యత ఏర్పడడానికి నే నిచ్చిన అవకాశం నా ఆశయ సాఫల్యతకు చక్కగా తోడ్పడింది. నేను బిగ్గరగా పుస్తకపఠనం ప్రారంభిస్తే 'ఏదో పిచ్చివాడి గోల—భరించక తప్పదు' అన్న చిరాకుతోనే వింటూ కూర్చునేవాడు సురేంద్ర. అలా నేను చదవగా చదవగా సురేంద్ర వినగా వినగా ఆ విన్నదాంట్లో కొంతకు కొంత అవగతం కాగా కాగా మెల్ల మెల్లగా పాఠ్యాంశాలు అతడి బుర్రలో చోటుచేసుకోసాగాయి. వేళకు నా చేతిలో పుస్తకం లేకపోతే అప్రయత్నంగా 'కాస్సేపు చదవరాదా ప్రకాశం' అనే స్థితిలోకి వచ్చాడు సురేంద్ర. చదువంటే అది ఛేదించడానికి వీలుగాని పాషాణంలాంటిదన్న దురభిప్రాయానికి బదులుగా పఠన, శ్రవణ, మననాది సాధనల మూలంగా దాన్ని అవలీలగా గుప్పిట్లోకి తెచ్చుకోవచ్చునన్న ఆత్మవిశ్వాసం ఒకటి క్రొత్తగా అతడి మనసులో ప్రోదిచేసుకోసాగింది.

దుర్వ్యసనాలు మనిషిని ఒక పట్టాన వదిలిపెట్టని మాట నిజమే! కానీ ఎంతటి దుర్వ్యసనాలైనా బొత్తిగా దోహద క్రియలు లేకపోతే విదాఘుంలో సెలయేళ్ళలా ఇంకి పోకేంచేస్తాయి? సురేంద్ర విషయంలో సరిగా అలాంటి పరిణామమే పొడసూపింది. రాత్రి నిద్రపోవడానికి ముందుగా ఉన్నట్టుండి జ్ఞప్తికి వచ్చినట్టు 'ఈ రోజు నేను రెండే రెండు సిగరెట్లు కాల్చాను ప్రకాశం' అనేస్థితికి వచ్చాడు సురేంద్ర. వృధాగా వీధులవెంట విహారాలు గూడా వెనుకబడ్డాయి. పెద్దపెద్ద తారాగణంతో బ్రహ్మాండమైన ప్రచారంతో విడుదలయ్యే చలనచిత్ర రాజాలు సురేంద్రకు కలిగించే సంభ్రమం సైతం తగ్గు ముఖం పట్టింది.

అనుకున్నంత కంటె సునాయాసంగా లక్ష్యాన్ని సాధించడంవల్ల మానవుడికి ఆనందం కలగడం సహజమే! ఆ ఆనందం అహంభావాని కెంతో దూరంలో వుండదేమో! అలాంటి అహంభావాన్ని తృణీకరించడమే అడుగడుగునా మహాత్ముల సాధన. నేను సామాన్య మానవుణ్ణి. ఆనందంతో గూడిన స్వాతిశయం నాకు కలగలేదని చెప్పడం సాధ్యం గాదు. ఆ సత్యాన్ని ఒప్పుకుంటూ, పనిలో పనిగా మానవుడు అల్పజ్ఞుడని మాత్రం మనవి చేసుకుంటాను. దప్పిక గొన్నవాడికి తేటనీటితో నిండిన సరోవరంకనిపిస్తే సంతోషించడ మొక్కటే తెలుసు. పొదలచాటున అడవి మెకం పొంచి వున్నదని అతనికేం తెలుసు? అందుకే అనిపిస్తుంది. పరిష్కృతమైన సమస్యకు వెనుక, జటిలమైనగడ్డు సమస్య వేరొకటి తనకోసంని కాచుకుని ఉండడం జీవనయాత్రలో మానవుడికి తరచుగా ఎదురయ్యే సంకటం.

నా కళాశాల జీవితంలో మూడో అధ్యాయం. ముఖ్యమైన అధ్యాయంగూడా! అది ఇందుబాల నా జీవితంలోకి ప్రవేశించిన అధ్యాయం.

సురేంద్రకో చెల్లెలుందనీ, ఆమె స్థానిక బాలికల కళాశాలలో చదువుకుంటోందని తెలుసు? అంతకుమించి నేనామెను గురించి తెలుసుకునే ప్రయత్నంలో లేను. లేదంటే మాటల సందర్భంలో అప్పుడప్పుడు చెల్లెలి ప్రసక్తి తెచ్చేవాడు సురేంద్ర—ఇందుబాల చక్కగా పాడుతుందట! హైస్కూలు వార్షికోత్సవాల్లో నృత్యాలు గూడా చేసిందట! "అంతెందుకు ప్రకాశం! నా కంటే మూడేళ్ళు వెనక పుట్టిందే ననుకో—కానీ యిప్పుడు మే మిద్దరమూ చదువుతున్న తరగతి ఒక్కటే! చదువులోనే గాదు, ఎన్నో విషయాల్లో నే నావిడముందు దిగదుడుపుకైనా పనికిరాను. ఈ రోజొక సినిమా చూస్తే మళ్లీ వారం రోజులనాటికి నాకు దాని పేరైనా జ్ఞాపకం వుండదు. మా ఇందు సంగతలా గాదు. పారూ దేవదాస్, అనార్కలీ సలీం, లైలా మజ్నూ-ఏ ఘట్టం కావాలి నీకు? వాళ్ల డైలాగ్స్ అలాగే ఒప్పజెప్పేస్తుంది..."

ఇందుబాల ఏకసంథాగ్రహి కాబోలు ననుకున్నాను. కాకుంటేనచ్చిన సినిమాను నాలుగైదుసార్లు చూస్తుందేమో!

ఇంకొకసారి అలాంటి వర్తమానమే మరొకటి చెప్పాడు సురేంద్ర.

మధ్యాహ్న భోజనం తరువాత వాలుకుర్చీలో సేద దీరుతూ డైరీ తిరగవేస్తున్నా డతను. "నియమంగా డైరీ

మెయింటెయిన్ చేసే అలవాటుందా సురేంద్రా?'' అని ప్రశ్నించాను.

''నాకా! అలాంటి అలవాట్లు నా కెక్కడినుంచి వస్తాయి ప్రకాశం? రూల్సు రెగ్యులేషన్స్ నా ఆరోగ్యానికి సరిపడవు. ఇంకా మా ఇందు సంగతి చెప్పు. ఒక్కొక్క రోజు అన్నమైనా మానేస్తుందేమోగానీ డైరీ వ్రాయడం మానదు. కానీ ఈ డైరీల తయారీని గురించి ఆమె దొక్కటే కంప్లెయింటు. మరీ చిన్న సైజుల్లోకి కుదించకుండా వీటిని ఆల్బమ్‌లా, అట్లాస్‌లా, ఇంకా వీలైతే దేశపటం సైజులో వేస్తే బాగుండిపోయేది. ఎందుకంటే ప్రకాశం—ఉదయం అయిదునుంచి రాత్రి పది గంటలదాకా జరిగే విశేషా లన్నింటినీ ఒకే పేజీలో పట్టించాలిగదా!''

''చూడనేర్చిన కళ్ళకు అన్నీ విశేషాలే కనిపిస్తాయి సురేంద్రా?'' అన్నాను.

''అలాగైతే తోటలో పువ్వులు పూయడం, వెన్నెల చల్లగా వుండటం, తెల్లవారుజామున కోడి గూయటం ఇవన్నీ విశేషాలే నంటావా ప్రకాశం?''

''మీ చెల్లెలు యిలాంటి విశేషాలు గూడా ఉటంకిస్తుందా సురేంద్రా?'' విస్మయంతో ప్రశ్నించాను.

''ఇలాంటివే యింకా బోలెడు! డైరీ రాయడానికి రోజు కొక గంటసేపైనా పడుతుందా ప్రకాశం! ఇక ఉత్తరాలు రాయడానికి కూర్చుంటే రోజల్లా అదేపని సరిపోతుంది. ఒక్కొక్కప్పుడు ఒకే రోజున ఒకే వ్యక్తికి సీరియల్‌గా రెండు మూడు ఉత్తరాలు రాయడంగూడా జరుగుతుంది...''

"ఐతే, మీ చెల్లెలు డైరీలు, జాబులు వ్రాయడం మానేసి హాయిగా కథలు వ్రాసుకోవచ్చునే!"

"కథలా! అసలైనా మా చెల్లెలు వ్రాయడం లేదని నీ కెవరు చెప్పారు? చూడు మిస్టర్ ప్రకాశం! నీకు మా ఇందును గురించి తెలిసింది చాలా తక్కువ! వెయిట్ అండ్ సి. వేచి కూచుంటేగానీ వెండితెరపైకి బొమ్మలు రావు..."

నిజమే! కుందనపు బొమ్మలాగే వచ్చింది ఇందుబాల.

ఆదివారంనాటి సాయంకాలం, అందాకా నిద్రపోతూ వుండి అప్పుడే లేచి కూర్చున్నాను. ఇంకా నిద్రమత్తు విడ లేదు. అద్దంలో నీడ మసలినట్లుగా గుమ్మంలో వర్ణసమ్మె ళనంలాంటిదేదో కనిపించినట్లు తోచి తల పైకెత్తాను. చూచిన క్షణంలో ఇందుబాలను పోల్చుకున్నాను.

ఏకోదరుల్లో ఒకరితో పరిచయమున్నవారు మరొక రిని పోల్చుకోవడం అసాధ్యమేమీ గాదు. కానీ, నేను తనని పోల్చుకోడం ఇందుబాల కెందుకో పరమాద్భుతమైన విష యంగా పొడగట్టింది.

అదొక్కటే గాదు. ఇందుబాల కెందుకో సంభ్రమం కలిగినమాట గూడా వాస్తవం! గుప్పిళ్ళతో గులకరాళ్ళు తీసుకుని నాలుగువైపులనుంచీ విసిరితే సరోవరంలో కలిగే కదలిక ఎలాంటిది? ఆ కదలికలాంటి సంభ్రమం ఆమె తనూ వల్లరిని లోలోపలినుంచీ ఊపివేస్తోంది. విలోకనాల్లోని విభ్ర మాన్ని చూస్తూంటే అరణ్యంలో హరిణంగా గాక భగవంతు డీమెకు మానవజన్మ ప్రసాదించడం అన్యాయమనిపిస్తుంది. వివిధ వర్ణవిద్యుద్దీపాల కాంతుల్లో వినోదంగా వున్న రంగ

స్థలంలా, సింధూరాన్ని చేటలతో చెరిగినట్లున్న సిగ్గులతో మెరుపు తీగలను ముక్కలు ముక్కలుగా చేసి రాసులు బోస్తున్నట్టున్న చిరునవ్వులతో ఆమె ముఖమండలం క్షణాని కొక సోయగం సంతరించుకుంటోంది. చక్కెర దిని చేదన గల ధైర్యం ఎవ్వరికుంటుంది? ఆ దృశ్యం కళ్ళకు కానుకగా వున్నమాట నిజం! ఆమె మాటలు బిగించిన వీణాతంత్రుల మీద మృదుమధురస్పర్శలా వీనులకు విందుగా వున్నమాట గూడా అంతే నిజం! కానీ నిజ మంతేగాదు. ఇందుబాలలో నాకు నచ్చనిది గూడా ఏదో వుంది? ఏమిటది?

ఎదుటి వ్యక్తిని దూరంగా నిల్చోబెట్టగల ప్రగల్భ భావం ఆమె హావభావాల్లో లీలగానైనా కనిపించదు.

ఎదుటివారికి ఒక్కటే అభిప్రాయం కలుగుతుంది—ఇందుబాల సులభురాలు!

సులభత్వం స్త్రీత్వానికి విలువ నిచ్చేదిగాదు.

అనుభవం వుండి కూడా ఆ అనుభవాన్ని స్వీయరక్షణకు వినియోగించుకోకపోవడమే అమాయకత్వమని ఓ రచయిత్రి చెబుతుంది. ఇందుబాల కింకా పదిహేడేళ్ళు నిండి నట్టు లేదు. ఈ పాటి వయసులో ఆమె కింతవరకూ అనుభవాలే వుండి వుండవు. ఆమె కున్నదంతా పుస్తకజ్ఞానం, సినిమాల పరిజ్ఞానం!

పుస్తకాల్ని, సినిమాల్ని తప్పు పట్టడానికి నే నెవర్ని? పుస్తకాల విస్తృతి కొన్నివందల పుటలు. సినిమాల విస్తృతి కొన్ని గంటలు. ఓ వ్యక్తి మరో వ్యక్తికి సన్నిహితం గావడానికి పుస్తకాల్లోనైతే కొన్ని పుటలు చాలు. సినిమాల్లోనైతే కొన్ని నిముషాలు చాలు. కానీ, జీవితంలో?

జీవితంలోకి యిప్పుడిప్పుడే ప్రవేశిస్తోంది ఇందుబాల. నాగరిక జీవితంలో ఆమెకు అపరిచిత వ్యక్తులు ఎదురయ్యే అవకాశాలు కోకొల్లలు. బహుశా అలాంటివాళ్ళల్లో నేనే మొదటివాడిని గావచ్చు.

ఇందుబాల అన్నగారిని కలుసుకోవడం కోసం వచ్చింది. కాకతాళీయంగా నన్ను కలుసుకున్నదంటే అందుకు గూడా వాళ్ళన్నయ్యే కారణభూతుడు. జరిగిన ప్రసంగంలో అతడి ప్రసక్తిగూడా పలుసార్లు రానేవచ్చింది. కానీ,అతడెక్కడికి వెళ్ళాడని అడిగి తెలుసుకునే స్పృహ మాత్రం ఆమెకు కలిగిందే కాదు. ఈ మైమరపు మనిషి కేమంత మంచిది?

సృష్టిలోని వైవిధ్యానికంతా ముకుటాయమానమైన నమూనాలా ఉంది. ఆలోచించాలి. మరి కొంచెం ఆలోచించాలి. అందుకు కొంత వ్యవధి అవసరం.

వీలయినంత త్వరగా ఇందుబాలను బయల్దేరదీశానంటే అందుకదే కారణం.

కానీ చెప్పుకోదగినవి, జ్ఞాపకముంచుకోదగినవి అయిన విశేషాలేవీ జరగకుండా, ఆ సమావేశం సాదాగా ముగిసిపోతే బాగుండునన్న నా ఆశ మాత్రం అడియాసే అయింది.

నగర కోలాహలం నడుమ, రాజవీథి పైన, సాయంకాలపు స్వర్ణ కాంతుల్లో ఇందుబాల రెండు గులాబీ పువ్వులు కొని అందులో ఒకటి ఈ ప్రకాశానికి బహూకరిస్తుంటే, ఇతగాడి బ్రతుకు ఎక్కడో సినిమాలో తెల్లవారినట్టుంది!

సినిమాల్లో గాకపోతే మన చుట్టూరా ఉన్న ప్రపంచంలో యిలాంటి సంఘటనలు జరగడం చాలా అరుదు.

సినిమా నుంచీ తిరిగి వచ్చిన సురేంద్రతో ఇందుబాల వచ్చి వెళ్ళిందని చెప్పాను.

"వచ్చి వెళ్ళిపోయిందా ప్రకాశం! అరరే, వచ్చిన సమయానికి నే నుండవలసింది" నొచ్చుకున్నాడు సురేంద్ర.

"కానీ నువ్వు లేనిలోటు కనిపించలేదు" అన్నాను.

"ఎందుకు కనిపిస్తుంది! అబ్బో, అఖండమైన తెలివి తేటలు. ఆవిడ చదివి పారేసిన పుస్తకాలే మా యింట్లో నాలుగు బీరువాల నిండుకూ ఉన్నాయి. ఒక పుస్తకం చదివి పూర్తి చేస్తే మళ్ళీ నాలుగు రోజులదాకా మన మనిషిగాదు ఆ పుస్తకంలోని పాత్రలో తా నొక్కతై పోతుంది."

"మీ యింట్లో మరెవ్వరూ పుస్తకాలు చదవరా సురేంద్రా!"

"మా అమ్మకు తీరికుండదు. నాకు ఓపికుండదు. పుస్తకాలు చదువుతూ కాలం వృధాచేయడం కన్నా చెరువుపైకి వెళ్ళి నాలుగు నీటికోళ్ళు కాల్చుకరావడం యింటికీ ఒంటికీ గూడా మంచిదని నా నమ్మకం! ఒకసారి మా ఇందు ఏం చేసిందో చెప్పనా ప్రకాశం! మంచిపుస్తకమని చెప్పి దాన్ని చదివేదాకా నా ప్రాణం ఒలుచుకు తినేసింది. తీరా చదివి చూద్దునుగదా, అదంతా పిచ్చివాళ్ళ గోల! ఓ అబ్బాయి ఓ అమ్మాయి, వాళ్ళు చిన్నతనంలో తోటల్లోనూ, దొడ్లలోనూ ఆడుకున్నారా, పెద్దవాళ్ళయినా ఆ అలవాటు మానుకోరు. ఒకరినొకరు మించి పోవాలనేమో ప్రియా అంటూ ఒకరైతే, ప్రియతమా అంటూ మరొకరు! ఒకరు చందమామ ఎంత బాగున్నాడో చూడు అంటే, ఇంకొకరు

కోయిల పాట ఎంత తీయగా ఉందో అంటారు. ఇంత జేసీ వాళ్ళు చూచుకునేదేమో వాళ్ళ ముఖాలే! వాళ్ళు వినేవి వాళ్ళ మాటలే! ఆ పుస్తకం పేరుకూడా మంచిదే - 'ప్రేమ మూర్తులు.' ప్రేమమూర్తులేరా బాబూ! కాకపోతే పేజీకి పది ప్రేమలా! చూడు ప్రకాశం! సీరియస్‌గా చెబుతున్నాను. ఎప్పుడైనా అచ్చాఫీసుకు వెళ్తే మరచిపోకుండా జ్ఞప్తికి తేవాలి నువ్వు. పాపం, ఆ ప్రేమ అన్న పదానికి సంబంధించిన టైపులు ఏ స్థితిలో వున్నాయో చూచి రావాలి మనం!''

ఎంతటి ముఖ్యమైన విషయమైనా సురేంద్ర మనసు పైన అదొక మెరపులా మెరసి మాయమౌతుంది. ఆలోచనలను కొనసాగనివ్వడం అతని పద్ధతి గాదు.

ఇందుబాలను గురించిన తలపులు అదను దొరికినప్పుడల్లా నన్ను మాత్రం వెంటాడుతున్నాయి.

రెండోసారి రావడం రావడమే చిరపరిచితురాలిలా వచ్చింది ఇందుబాల.

''వచ్చావా ఇందూ! నిన్ను గురించిన విశేషాలన్నీ ప్రకాశంతో చెప్పేశాను. లోలోపల నువ్వంటే కొంచెం భయం కలిగినట్టే ఉంది. పాపం, అదో తరహా మనిషి. ఒకే సారిగా బెదరగొట్టేయకు.'' అంటూ స్వాగతం చెప్పాడు సురేంద్ర.

ఇందుబాల సిగ్గుపడిపోయింది. ఆ సిగ్గుపడిన తీరు మరీ చిత్రంగా ఉంది. రెండు చేతులతోనూ రెండు కళ్ళను మూసుకుని, వేళ్ళ సందుల ద్వారా అల్లల్లాడుతున్న కను

రెప్పల క్రిందినుంచీ ఈవలికి చూస్తూ "భలేవాడి వన్నయ్యా! నేను బెదరిస్తే బెదరిపోవడానికి ఇక్కడ పాలు తాగే పసి వాళ్ళెవరూ లేరు" అంది ఇందుబాల.

"ఏమిటో మరి! నీకు సంబంధించిన ప్రతి విషయమూ ప్రకాశానికి ఆశ్చర్యం కలిగించేదే! అన్ని వివరాలు సాకల్యంగా అడిగి తెలుసుకున్నాడు."

"అబ్బే, నే నడిగిందేముంది సురేంద్రా!" అంటూ అడ్డు తగిలాను.

"ఎలాగైతేనేం, తెలుసుకోవడమే ముఖ్యం!" అన్నాడు సురేంద్ర.

"అంతేలే అన్నయ్యా! ప్రకాశ మెక్కడ మన మెక్కడ? ఆయన తెలుసుకో దగినంతటి వాళ్ళా మనం!" నిష్ఠూరపడింది ఇందుబాల.

ఆ అన్నా చెల్లెళ్ళ ఎదుట నాకు మానమే శరణ్యం కాసాగింది.

మరికొన్ని రోజులు గడిచి పోయాయి.

ఎందుకో గానీ ఇందుబాల వచ్చినప్పుడల్లా ఆమె త్వరగా వెళ్ళిపోతే బాగుండున్న ఉద్దేశం నాలో రగులుకునేది.

అంటే ఏమన్న మాట! సురేంద్ర చెప్పినట్టుగా ఇందుబాలంటే నాకు లోలోపల భయం కలుగుతోందన్నమాట.

స్పష్టంగా భయకారణమైన ఉదంతం మళ్ళీ నెల రోజుల వ్యవధిలో జరిగింది.

చదివి పంపిస్తానని చెప్పిన పుస్తకంపైన ఇందుబాల నా చిరునామాకు ఓ ఉత్తరం వ్రాసి పడేసింది.

"ప్రకాశంగారూ,

మీ రిచ్చిన పుస్తకం ఎంత బాగుందని? హాస్టలంతా మాటుమణిగాక ప్రారంభించాను. తోటలోనుంచి వస్తున్న గాలి ఉండి ఉండి పరిమళాలను దెచ్చి గదిలో కుమ్మరిస్తోంది. చదవడానికి కూర్చున్నప్పుడు. బయట చిమ్మచీకటిగా ఉంది. ఊరికి దూరంగా చీకటిలో మినుకు మినుకున విద్యుద్దీపాలు వెలుగుతున్న చోట చెరసాలలా కట్టి వుంచిన హాస్టల్లో నివసిస్తున్న వాళ్ళకు చీకటి రాత్రు లెంత భయావహంగా ఉంటాయో మీకు తెలియదు. ఎప్పుడొచ్చిందో వెన్నెల! వెన్నెల్లోకి చూస్తూ ఉండి, ఉన్నట్టుండి పుస్తకం తెరిచానేమో 'బాగుంటుంది, ఈ పుస్తకం చదవండి' అంటున్నప్పటి మీ ముఖమే కనిపించింది..."

మరికొన్ని పేరాలదాకా అలాగే కొనసాగిన ఆ ఉత్తరాన్ని చదివి ముగించాను.

శత్రువు చేతికిచ్చినా ఒప్పుకోక తప్పదు—ఇందుబాల చక్కగా ఉత్తరం వ్రాస్తుంది.

ఎటొచ్చీ ఉత్తరం వ్రాయడానికున్న ఆవశ్యకత దగ్గరే సందేహం!

కొద్దిరోజుల్లో ఇందుబాల యిటువైపు రాకపోదు. పుస్తకం బాగుందని అప్పుడు చెప్పనేనా చెప్పవచ్చు. చెప్పకపోయినా నష్టమయ్యేదేమీ లేదు. అయితే ఉత్తరం వ్రాయడంవల్ల ప్రయోజనం?

ఒక్కటే ప్రయోజనం కనిపిస్తుంది?—ఈ తతంగం నానాటికీ వామనుడి విశ్వరూపంలా అభివృద్ధి జెందడం?

నా రచనలు శాంతి రేఖలను మోసుకెళ్ళే దయా పారావతాలు అంటాడు కవి. ఆ ఆత్మవిశ్వాసం అతనికుంది. వుండక తప్పదేమో గూడా! అందుకే విశాలప్రపంచంపైన అనుదినమూ జరిగిపోతున్న కోట్లకొలది కార్యాలను రెండు వర్గాలక్రింద విభజించాలన్న బుద్ధి కలుగుతుంది. ఏదైనా ఒక పని చేయాలన్న ఉబలాటంకొద్దీ చేసేవి కొన్ని. ఈ పని తప్పకుండా చేసి తీరాలన్న గాఢమైన లక్ష్యంతో చేసేవి కొన్ని. ఏదైనా ఓ పని చేయాలి, ఎటైనా ఓ వైపు వెళ్ళాలి మొదలైన అస్పష్ట నిర్ణయాలతో జరిగే పనులవల్ల లోకానికి మేలు చేకూరడం కష్టం. ఒక వేళ చేకూరితే అది అదృష్టం. ఈ సత్యం వ్రాతలోనైనా వర్తించక పోదు. ఉత్తరాల పుట్టుక ఈనాటిది కాదు. లిపి పుట్టిననాటి నుంచీ ఈ కళ ఏదో ఒక రూపంలో వుండి వుంటుందని భావించవచ్చు. కానీ, ఈ ఉత్తరాల కళ ప్రారంభంలో ఆవశ్యకతవల్ల మాత్రమే పుట్టి వుంటుందనీ, అందువల్లనే పెంపొంది వుంటుందనీ విస్మరించ లేము. ఎప్పుడో పథ్యంక్రింద పుచ్చుకోదగిన ఔషధాన్ని ప్రతిరోజూ ఆహారపదార్థం క్రింద వాడుకోసాగితే అందువల్ల శరీరానికి చెరుపు కలగదని ఎవరు చెప్పగలరు? మిక్కిలి స్వల్ప వ్యయంతో ఉత్తరాల బట్వాడా నీళ్ళు త్రాగినంత సులభంగా పరిణమించిన తరువాత ఉత్తరాలు వ్రాయడం అదొక ఉబుసు పోక వ్యవహారంగా గూడా పరిణమించిందని ఎవ్వరికి తెలియదు?

ఆదిలో కేవలం ఉబుసుపోకకే గావచ్చు—

ఇంక్రిమెంట్లు, ప్రమోషన్‌లు లేని కొలువు ఉద్యోగికి రుచించదు. చేస్తున్న పనేదైనా సరే, దానికి క్రమక్రమంగా కొన్ని అదనపు ఆకర్షణలను అభిలషించడం మానవ స్వభావం. ఈ పరిణామదశలో యువతీయువకులు ఉత్తరాలతో ఒకరి నొకరు పలుకరించుకోవడం ఒక రసవత్తరమైన ఘట్టం!

ఈ ఘట్టంలోనైనా ప్రాథమిక దశలోని ఉత్తరాలు, ప్రకృతి వర్ణనలు, పుస్తక పరిశీలనలు లాంటి అప్రధాన విషయాలకే పరిమితమై వుండడం సహజం! కానీ కాలక్రమాన వాటికన్నా ఆసక్తి జనకమైన 'వస్తువు' కావలసివస్తుంది ఉత్తరాలకు! మృదువైన భావాలను, మధురమైన అనుభూతులను మెత్తని మాటలతో ఉత్తరాల్లోకి చొప్పించడం జరుగుతుంది. ఈ పరిణామక్రమంలో ఓ ముఖ్యమైన మజిలీని 'ప్రేమ'గా పేర్కొనవచ్చు.

ఐతే ప్రేమకోసం వుత్తరాలా? వుత్తరాలకోసం ప్రేమలా?

నిరపాయకరమైన ఓ వుత్తరాన్ని గురించి మిక్కిలిగా ఆలోచించి నేను బుర్రను పాడుచేసుకుంటున్నానేమో నన్న అనుమానం కలుగకపోలేదు. రజ్జు సర్పభ్రాంతి అయితే చింతే లేదు. కానీ, లోకంలో రజ్జు సర్ప భ్రాంతులతో బాటుగా సర్పాన్ని రజ్జు వనుకునే భ్రాంతులు గూడా దండిగానే వున్న మాటను ఎలా కాదనగలము.

కాగా పోగా నాకూ ఇందుబాలకు మధ్య ఏర్పడిన పరి

చయాన్ని ఇంకొక్క అడుగైనా ముందుకు సాగనివ్వగూడ దన్న నిర్ణయానికి మాత్రం రాకతప్పింది గాదు.

ఆ నిర్ణయాన్నయితే ఆశ్రమంగానే అమల్లో పెట్ట గలిగాను.

ఇందుబాల పట్టణంలోకి రానున్నదని తెలిసిన సెలవు రోజుల్లో గదిలో వుండకుండా లైబ్రరీలవెంట తిరిగేవాణ్ణి. ఒక్కొక్కప్పుడు తప్పనిసరిగా కలుసుకోవలసివచ్చినా మౌన వ్రతం అవలంబించేవాణ్ణి. ఆమె అభిప్రాయాలను ఛలోక్తులను ముభావంతో స్వీకరించేవాణ్ణి.

హఠాత్తుగా నా ప్రవర్తనలో వచ్చిన మార్పువల్ల ఇందుబాలలో సైతం మార్పు కనిపించింది. కానీ అది నే నాశించిన మార్పుమాత్రం గాదు.

మొదట మొదట ఇందుబాల మానసికంగా కృంగి పోయినట్టు కనిపించింది. నిరాశలు, నిట్టూర్పులు, మాన వులపైన విశ్వాసరాహిత్య తీర్మానాలు మున్నగు దగాపడిన ప్రేమికురాలి లక్షణాలు ఆమెలో బాహాటంగా కనిపింప సాగాయి. పులిమీద పుట్రలా ఆమె నాపైన ప్రతీకారచర్య తీసుకోదలచినట్టుగా 'రంగబాబు' అన్న విచిత్ర వ్యక్తిని రంగంపైకి తీసుకొచ్చేసింది.

అన్నగారి పేటీకి వచ్చినప్పుడల్లా ఆమె ఆ కొత్త వ్యక్తిని గురించిన కబుర్లను అసంఖ్యాకంగా చెప్పసాగేది, రంగబాబు సామాన్యుడు గాడు. నోటితో మాట్లాడుతూ, నొసలితో వెక్కిరించేవాడుకా డతను. గొప్ప కలుపుగోలు మనిషి. నమ్మినవాళ్ళకు గుండెకాయకోసి యివ్వమన్నా

ఇవ్వగలడు. అతడు హాకీ ఆటలో విరిచి మూల పడ వేసిన బ్యాటులతో అవలీలగా కొన్ని యజ్ఞాలు చేయవచ్చు. ఆటగాడే కాదు, అతడు పాటగాడు కూడా! అతని పాట పాటగాడు. అది ఆనందలోకాలకు బాట.

ఏకాంతంలో సురేంద్రను అడిగాను, ఆ రంగబాబును గురించి వివరంగా చెప్పమని.

"ఓహో, అతడా ప్రకాశం! అతడి పేరు రంగ బాబు. నాకైతే అతగాణ్ణి గురించి అంతగా తెలియదు గానీ, అతనికీ, మాకూ ఏదో దూరపు బంధుత్వ ముందట! వాళ్ళ నాన్నగారి పేరు అప్పుడప్పుడు పేపర్లలోగూడా వస్తుంది. మీసాల సుబ్బారాయుడుగారని గొప్ప పేరుమోసిన కంట్రాక్టరు—"

"ఇంతకూ అతడీ ఊళ్ళో ఏం చేస్తున్నట్టు?"

"ఏదో టెకినికల్ కాలేజీలో చదువు. ఏం, అతణ్ణి కలుసుకోవాలని వుందా ప్రకాశం? చెల్లాయి ఇంట్రొడక్షను అలాంటిది. ఇంట్రొడక్షనే యింత బాగుంటే, ఇక ఆ పుస్తకం ఎంత బాగుంటుందోనన్న కుతూహలం ఎవరికైనా కలుగు తుంది .."

సదరు రంగబాబును ఒకానొక కాలేజి వుత్సవంలో కలుసుకున్నాను. పొట్టిగా, దిట్టమైన మనిషి. చారల పైజమా పైన గట్టిగా అతుక్కుపోయినట్టున్న బనీను తొడుక్కు న్నాడు. ఇందుబాల చెప్పినట్టు అతడు గొప్ప కలుపుగోలు మనిషి. గూడా! పరిచయమైన అయిదు నిమిషాల్లో అతడు తాను చూచిన యింగ్లీషు సినిమాలోని నాట్యఘట్టాలను వర్ణింపసాగాడు.

వాకబుచేయగా మరికొన్ని వివరాలు తెలిశాయి. హాకీ ఆటలోనే గాదు, ప్రేమలేఖలు వ్రాయడంలో గూడ సిద్ధహస్తుడు రంగబాబు. నాలుగైదు బాణీల్లో నలుగురైదు గురు అమ్మాయిలకు ఉత్తరాలు వ్రాసి భారీ ఎత్తున ప్రేమ కలాపాలు నిర్వహింపబూని నందుకు ఫలితంగా అతడొక కాలేజీనుంచి తొలిగింపబడ్డాడు.

ఈ వర్తమానాన్ని చాలా తేలిగ్గా తీసుకున్నాడు సురేంద్ర. "అలాంటి గొడవేదో జరిగిందని నాకూ చూచా యగా తెలుసు. అడ్వెంచర్లు లేనిదే ఒక్క నిమిషం బ్రతక లేడు రంగబాబు. వాడు కాలేజీనుంచి తొలగింపబడ్డ కొద్ది రోజులకే ఆ ప్రిన్సిపాలుగారికి రివర్షనొచ్చిందని గూడా చెప్పు కున్నారు. అమ్మో, మీసాల సుబ్బారాయుడిగారిజోలికి వెళ్ళడమే! ఎన్ని గుండెలుండాలి? తారున కాల్చిపారెయ్యడూ!"

తొలగించుకోడానికి వీల్లేని భయాందోళనలు ఒక్క సారిగా నన్ను ఆవహించుకోసాగాయి. తెలిసి చేసిన నేరం మానవుడు తన మనశ్శాంతికి పెట్టుకునే చిచ్చులాంటిది. ఆ పాపం శాపంలా మనిషిని వెన్నంటక విడువదు. లోకమంతా ఆనందధామంగానూ, మానవుల హృదయాలన్నీ అనురాగా లకు నిలయంగానూ భావించే చిత్తప్రవృత్తి ఇందుబాలకు రక్షణ నిచ్చేదిగాదు. ఈ నిస్సహాయకరమైన పరిస్థితిలో ఆమె కర్మకొద్దికీ ఆమెను వదిలిపెట్టటం న్యాయమేనని నేనను కోలేను. తక్కుతూ, తారుతూ దగ్గరగా వచ్చిన జింకపిల్లను బెదరగొట్టి ముప్పన్నెమెకం నివసిస్తున్న కొండ గుహవైపుకు తరిమివేయడం ధర్మమేనని నేను భావించను.

తనకు మాలిన ధర్మమే గావచ్చు. దాన్ని శిరసా వహించక తప్పిందిగాదు. నిజస్వరూపస్వభావాలను మారు వేషంలో దాచుకోడం తప్పయితే, ఆ తప్పు నే నెన్నడో చేశాను. ఇప్పుడదే మారువేషంతో మరొక తప్పు చేస్తున్నాను. అది కేవలం స్వార్థంకోసం చేసిన తప్పయితే, ఇది ఇతరులకోసం చేయక తప్పకుండా వున్న తప్పిదం. నిస్స్వార్థంగా యితరులకు చేసిన మేలు జీవన యాత్రాపథంలో మానవుడికి తోడునీడగా, కరదీపికగా వుపకరిస్తుందని పెద్దలు చెబుతారు. ఆ సంతృప్తి ఒక్కటి నాకు దక్కితే చాలు...

తెరపడి మళ్ళీ పైకి లేచినట్టుగా నా కాలేజీ జీవితంలో నాలుగో అంకం ప్రారంభమైంది.

గడచిన కొలది రోజులుగా నా ప్రవర్తనలో మార్పు కనిపించిందంటే అందుకు కారణాలు వేరే వున్నాయని కల్పించి చెప్పాను. ఇకపైన ఎట్టి పరిస్థితిలోనూ తన మనసుకు నొప్పి కలిగించనని హామీ యిచ్చాను. చివరకు ఏపని జరగడంవల్లనైతే ఇందుబాల నుంచీ దూరంగా వుండదలచుకున్నానో ఆ పని చేయడానికి గూడా నేను సాహసించాను.

కాగితంపైన కలం మోపి ఇందుబాలకు వుత్తరం వ్రాసే ప్రమాదం నుంచి నన్ను భగవంతుడు గూడా రక్షించ లేక పోయాడు.

ఆ రోజుల్లో 'ప్రేమ'ను గురించి నే నదేపనిగా ఆలోచించే వాణ్ణి.

ప్రవాహశీలమైన భాషలో కొన్ని పదాలు వ్యవహారంనుంచీ వెలివేయబడి విస్మృతిపథంలో పడిపోయినట్టే,

మరికొన్ని పదాలకు విశేష ప్రాచుర్యం సిద్ధించటమూ కద్దు. రెండో తెగకు చెందిన పదాల్లో ప్రేమ ఒక్కటి. విరివిగా లభించే వస్తువుకు విలువ తగ్గడం సహజం! ఆ విధంగా విలువను గోల్పోయిన పదాల్లో ప్రేమ ఒక్కటి మాత్రమే గాదు. ప్రథమ గణ్యమైనది గూడా!

ప్రేమే దైవమన్నది బడి గోడలపై కనిపించే సూక్తి. అది యిచ్చేదేగానీ పుచ్చుకునేది గాదని పుస్తకాల్లో వ్యాఖ్యానం. దానికీ విషయవాంఛకూ నాకలోకానికి నక్కకూ వున్నంత దూరమని విజ్ఞుల హెచ్చరిక. కానీ అలాంటి పూజ్యభావంతోనే వుపయోగింపబడుతున్నదా అన్నదే సందేహం.

తీరిగ్గా లైబ్రరీలో కూర్చుని పురాణ ప్రబంధాద్యనేక ప్రాచీన గ్రంథాలను తిరగవేస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఆశ్వాసాని కొక్కచోటనైనా ప్రేమ అన్న పదం కనిపించదు.

మన పూర్వులు ప్రేమించేవాళ్లు కారేమో!

కన్నుదోయికి అన్యకాంత లడ్డంబైన మాతృభావం చేసి మరలడం మంచిదన్న విశ్వాసం ఆ రోజుల్లో బలీయంగా వుండేది. కాని, అందుకు విరుద్ధమైన ప్రవృత్తి గూడా ఆ నాడు లేకపోలేదు. ఐతే వాళ్ళు మోహించేవాళ్ళు, కామించే వాళ్ళు, వాఛించేవాళ్లు-అంతేగానీ విషయ వాంఛకు ప్రేమ అన్న బురఖా తగిలించి పబ్బం గడుపుకోడానికి ప్రయత్నించే వాళ్ళు గారు. మాటల గారడీతో లోక ప్రతారణంతో బాటుగా, ఆత్మవంచనకు గూడా పాల్పడేవాళ్ళు కారు.

ఆహార నిద్రా మైథునాలు ప్రాణులకు ఆవశ్య కర్తవ్యా

లనీ, శృంగార రసానికి స్థాయి భావం రతి అనీ నిర్దేశించ డంలో వాళ్ళు జీవితాన్ని సీరియస్ గా తీసుకున్న విషయం అభివ్యక్త మౌతుంది.

ప్రేమ శృంగారరస సంబంధి అయిన భావం అవునా కాదా? కాకపోతే ఓ అబ్బాయి అమ్మాయితో "నేను నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను. నా ప్రేమ పవిత్రమైనది" అని చెప్పడంలో ఆంతర్యమేమిటి? ప్రేమకు శృంగారానికీ సంబంధం లేకపోతే అమ్మాయిని అబ్బాయి తన భోగ్య వస్తువుల్లో ఒక్కటిగా గణింపవలసిన కర్మ కర్త్రిగానీ, అబ్బాయి వినా తన జీవితం మరుభూమి సదృశమని అమ్మాయి కుమిలి పోవలసిన అవసరంగానీ కనిపించదే! అలాగైతే కామిస్తున్నా మని అనుకోడానికి దమ్ములు లేకనే గదా ఈ కపటనాటకం!

ప్రాచీన సాహిత్యంలోనూ గాక, అలనాటి జాతి రక్తంలోనూ గాక, ఈనాడు మంటికీ, మింటికీ ఏకాకృతిగా కనిపిస్తున్న ఈ నవీన ప్రేమ భావానికి పునాదిరాళ్ళు ఎక్కడు న్నాయి? ఓడల కెక్కించబడి, సముద్రాలు దాటించబడి ఈ దేశంలో వెదజల్లబడిన విజాతీయ భావాల్లో యిదొక్క టైతే దీని ఎదుట జాతి జాతంతా సాగిలబడవలసిన అవసరం ఏముంది? దీన్ని సాహిత్యానికి, సంస్కృతికి, జీవితానికి పులుముకోవలసిన అవసరం ఏముంది?

పోనీ, నిజంగా ప్రేమ పవిత్రమైనదే అయితే నేను నా పెళ్ళాన్ని ప్రేమిస్తున్నానని చెప్పేకునే మగవాడు కని పించడేమి?

"ఆ అమ్మాయిని నేను గాఢంగా ప్రేమిస్తున్నా"నని చెప్పుకోడం లోకంలో సహజమైన విషయం. ఎందుకంటే ఆ అమ్మాయి పరనారి గనుక; అదే అమ్మాయి వివాహానంతరం కులకాంతగా పరిణమించిన తరువాత మగడామెను ప్రేమిస్తున్నానని చెప్పుకోవడం ఆపహాస్యభాజనం!

మనోకాననంలోని క్రూరమృగాలకు మారువేషం వేయడానికి వుపకరించే మేకతోలు లాంటిదేనా ఈ ప్రేమ?

ఆలోచనల గొడుగు చేతబట్టుకుని సన్నటి కమ్మి లాంటి ఆశయ సాధనపైన నడుస్తూ కన్ను చెదరిపోకుండా, కాలు తొలగిపోకుండా అదొక సర్కస్ ఫీట్‌లా మసులుకోవలసిన రోజులవి. నాకు లభించిన పాత్ర చక్కగానే నిర్వహింపబడిందన్న నమ్మకం నాకుంది. నా కంతకంటే కోరదగిన దేముంది?

ముఖ్యపాత్రలను కత్తుల బోనులాంటి సందిగ్ధావస్థలో యిరికించి తమాషా చూసుకోమని చెప్పే పతాక సన్నివేశం బహుశా నాటకంలో చిట్టచివరి అంకంలో కాబోలు వస్తుంది. రామదుర్గంలో నా కెదురైన ఘట్టం అలాంటి సన్నివేశానికి తీసిపోయేదేమీ కాదు.

శారీరకంగానూ, మానసికంగానూ తల్లితండ్రులనుంచీ బిడ్డలకు కొన్ని లక్షణాలు సంక్రమిస్తాయని శాస్త్రం చెబుతుంది. శారీరక లక్షణాలను అటుంచి చూస్తే అనసూయమ్మనుంచీ సురేంద్రకొక వాస్తవిక దృష్టి మినహాగా మరెట్టి మనోలక్షణమూ సంక్రమించలేదని తోస్తుంది. లేదంటే లోకాన్ని తేలికగా చూచే గుణం గూడా ఎంతో కొంత అలవడి నట్టే

వుంది. ఎటొచ్చీ స్వభావాన్ని బట్టి చూస్తే ఇందుబాల మాత్రం ఆ తల్లి కూతురనిపించదు.

రామపట్టాభిషేకానంతరం జరిగిన బహుమతి ప్రదానంలో తనకు లభించిన అమూల్య రత్నాన్ని చితకగొట్టి అందులో రాముని రూపం కనిపించలేదని, రామనామం వినిపించలేదనీ హనుమంతుడు నిర్వేదం చెందాడని ఓ కథ ఉంది. హనుమంతుడి భక్తిభావం లాంటిదే అనసూయమ్మ వాస్తవిక దృక్పథం. కులీనత, విద్య, వివేకం, సుస్వభావంలాంటి గుణాలు మనిషికి తమంతట తాముగా కూడూ గుడ్డా ప్రసాదించలేవన్న నిశ్చితాభిప్రాయం ఆమెది! వ్యక్తిత్వానికి ఓ ఆకారాన్నిచ్చేది సంపద. మిగిలిన గుణాలన్నీ అలంకారప్రాయాలు. ఆకారమే లేకపోతే హంగులేం చేసుకోను!

రామదుర్గం వెళ్ళగానే నాకో ముఖ్యాంశం విదితమైంది. భర్తృవియోగానంతరం ఆ లోటు కనుపించకుండా ఆ లోగిలిని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుకుంటున్న అనసూయమ్మ నాలాంటి ఆగంతకులకు స్వాగతసత్కారాలు నెరపడానికి సిద్ధంగా లేదు. వచ్చినవాడు వట్టి స్నేహితుడు మాత్రమే అయితే ఆ పద్ధతి వేరు. ఇవ్వదగినంత మర్యాద యిచ్చి, పుచ్చుకోదగినంత గారవం పుచ్చుకొని ఆ అతిథిని ఆమె సాగనంపి వుండేది. అలా కాకుండా ఆ కొడుకూ, ఈ కూతురూ గూడా వచ్చినవాడిని తాము బ్రహ్మప్రయత్నంతో పట్టణంనుంచి తెచ్చుకున్న వెలలేని బహుమానంగా తలపోస్తున్నారు. ఎందుకని? అతగాడిలో ఏముందని?

నాపైన అనసూయమ్మ కెందుకో అనుమానం కలిగిన మాట నిజం.

అపరాధ పరిశోధకుడికి ఒక్కొక్కప్పుడు కారణం స్ఫురించక మునుపే కొండొక వ్యక్తిపైన అనుమానం కలుగుతుంది. అతడే నేరస్తుడని నిరూపించడానికి కావలసిన ఆధారాలు తన దగ్గర లేకపోయినా. అతడిపైన ఓ కన్ను వేసి వుంచడంలో పరిశోధకుడు అప్రమత్తత వహించడం జరుగుతుంది. అనసూయమ్మ చూపుల్లోను, ప్రసంగాల్లోనూ నా కలాంటి నిశిత పరిశీలన వ్యక్తమైంది. ఈవిడ సురేంద్ర కాదు. ఈవిడ ఇందుబాల కాదు. ఈమె అనసూయమ్మ. వృక్షాగ్రాన కూర్చుని రాళ్ళు విసిరి, పళ్ళికిలించి మృగరాజంపైన పిల్ల చేష్టలైతే చేయవచ్చు. కానీ ఆ విజయ గర్వంతో బరి తెగించి చకచకా దాని ఎదుటికి నడిచిపోతే ఏమౌతుంది? ఎవరు ఎవరైందీ క్షణంలో తేలిపోతుంది.

అలాంటి అపాయంనుంచీ తప్పించుకోడానికి నాకు మిగిలిందొక్కటే మార్గం-కాలికి బుద్ధి చెప్పడం.

కానీ రంగంనుంచీ నిష్క్రమింపదలచిన నేరస్తుడు తనకు సంబంధించిన ఆధారాలను అక్కడే దిగవిడిచి వెళ్ళడానికి సమ్మతించడు. ఇందుబాలకు నేను వ్రాసిన ఉత్తరాలు నా ఆశయానికి విరుద్ధంగా వ్రాసినవనీ, వ్రాయవలసి వచ్చినవనీ, చెబుతే ఆ అబద్ధం ఎవరికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది?

వాటిని తస్కరించడమే తరుణోపాయమైంది.

కానీ మానవుడు తనకు తాను సంజాయిషీ చెప్పుకుంటే చాలదు. లోకానికి చెప్పుకోవాలి. సంఘజీవిగా బ్రతక

దలచుకున్న ప్రతివ్యక్తినీ నిలదీసి వాడి ప్రవర్తనకు సంజాయిషీ అడిగే హక్కు లోకానికుంది.

ఈ పాటికి నా సంజాయిషీ-కాకపోతే క్షమాపణ పత్రం వాళ్ళ చేతికి దొరికి వుంటుంది.

## 3

"అయిందానికీ, పోయిందానికీ విచారిస్తూ కూర్చుంటే ఏం లాభమమ్మా ఇందూ! ఆ కాడికీ మన అదృష్టం బాగుండబట్టి సరిపోయింది. నాకైతే వీ డెవడో గుండెలు తీసినబంటని చూడగానే తెలిసిపోయిందనుకో-ఎంతగా అసాధ్యపు ఘటం గాకపోతే పెట్టె తీసి కాగితాలు కాజేస్తాడు? అలాంటివాడు కంటిలో పాపను కత్తిరించడూ!"

"అలా అనొద్దమ్మా! ప్రకాశం నువ్వనుకున్నట్టు టూలాటోలీ మనిషిగాడు. అతడి సంగతి నాకంటే అన్నయ్యకే బాగా తెలుసు..."

"అన్నయ్య కేం తెలుసు? ఈ చెల్లెలికి తగిన అన్నే వాడు గూడా. ఇదిగో ఇందూ! నేను చెబుతున్నా! ఈ ఇంట్లో ఏదో విడ్డూరం జరిగిపోయిందని ఊళ్ళో ఈపాటికి గుసగుసలు ప్రారంభమై వుంటాయి. వాళ్ళ సందేహాలను బలపరుస్తూ మనం ముఖాలు వ్రేలాడేసుకుంటే ఇంకేముంది? అగ్గిలో ఆజ్యం పోసినట్టే! ఎందుకొచ్చిన తలవంపులు? ఎవడో వచ్చాడు, వెళ్ళాడు. అంతకుమించి మరేం జరగలేదనుకోవాలి."

"ఆపాటి నిబ్బరాలు మాకు లేవు..."

"మరేమున్నాయి మీకు! దారంటే వెళ్ళే ఓ దాన య్యను పట్టి తెచ్చి తలపై కెక్కించుకునేపాటి తెలివితేట లైనా వున్నాయా ఇందూ!"

"అమ్మా!" కోపంతో నా ఒళ్లు కంపించిపోతున్న దేమో, కేక గూడా కంపించింది.

"చేసిన నిరవాకానికి తోడుగా కోపాలు గూడానా ఇందూ! బ్రతుకంటే నేర్చిన మాటలు వల్లించడం కాదు. నీతో నాకు వాగ్వాదాలు దేనికి? నువ్వు లేచి వెళ్ళి ముఖం కడుక్కొని భోజనం చేస్తే చాలు. అదైనా నాకోసం గాదు. ఉదయం నుంచీ నువ్వీ గదిలో ఏడుస్తూ కూచున్నావనీ, మధ్యాహ్నం భోజనం చేయలేదనీ వంటలక్క పసిగట్టినా చాలు, చిలవలతో పలవలతో కథ లల్లుకపోతాయి..."

కూతు రేమైపోయినా ఈవిడగారికి పరువే ముఖ్యం!

లేచి వెలుపలికి వచ్చాను.

ఇల్లంతటా నిశ్శబ్దం. నలిగిపోయిన రబ్బరు బొమ్మలా వాలు కుర్చీలో పడుకున్న అన్నయ్యలోనైనా చలనం లేదు. సబ్బుపెట్టి ముఖం కడుక్కొని భోజనాల గదిలోకి వెళ్ళాను. వంటలక్క గూడా వెళ్ళిపోయిందేమో, అక్కడి గదులు గూడా నిర్జనంగానే వున్నాయి. వడ్డించుకోడానికి వీలుగా వంటకాలన్నీ బల్లపైన వున్నాయి.

భోజనానికి కూర్చున్నానో లేదో మళ్ళీ అమ్మగొంతు వినిపించింది.

‘‘అది కాదురా సురేంద్రా! అతగాడు చెల్లాయికి ఉత్తరాలు వ్రాస్తున్నాడని నీకు తెలియదేమిటి?’’

‘‘తెలిస్తే మాత్రం? అత డెవరికైతే ఆ ఉత్తరాలు వ్రాస్తున్నాడో వాళ్ళ కవి ప్రీతిపాత్రంగానే వున్నప్పుడు వద్దనడానికి మధ్యలో నే నెవర్ని? ఐనా చెట్టంత మనిషే కని పించకపోగా, ఈ వుత్తరాల గొడవెందుకమ్మా నీకు? ఎలాగూ అతడు వ్రాసిన వుత్తరాలను అతడే తీసుకెళ్ళిపోయాడుగదా!’’

‘‘ఇదేం నిదరమొత్తనంరా సురేంద్రా! చదవగా చద వగా వున్న మతిగూడా పోతుందంటే ఏమిటో ననుకునే దాన్ని! ఇదే నన్నమాట! తాను వ్రాసిన వుత్తరాలను తాను తీసుకెళ్ళిపోయేపాటి ముందు జాగ్రత్త వున్న పెద్దమనిషి అలాగే అమ్మాయి వ్రాసిన వుత్తరాలను ఇక్కడ పారేసి వెళ్ళగూడదూ!

‘‘అదీ పాయింటే! ఒకమాట చెప్పనా అమ్మా! ఎంతగా బుర్ర జించుకున్నా ప్రకాశం ఎందుకిలా చేశాడో అర్థం గావడం లేదు నాకు! ఐనా ఆ వుత్తరాలను తీసుకెళ్లి మాత్రం అతడేం చేసుకుంటాడు? బహుశా ఇక్కడెక్కడో పడేసే వుంటాడు...’’

అన్నం గొంతుక వెంట దిగడంలేదు. లేచి బయటికి వెళ్తే ఎవరి ముఖాన్నయినా చూడవలసి వస్తుందన్న బెంగతో మెతుకుల్ని ఎంచుతూ కూర్చున్నాను.

‘‘భోజనమైందా ఇందూ!’’ అమ్మ పిలుపు.

‘‘..................’’

"అయివుంటే ఒకసారి ఇక్కడకి వచ్చి వెళ్లు. ఇక్కడో శ్రీముఖం వుంది మనకు?"

శ్రీముఖమా?

తొందరగా చేయి కడుక్కుని హాల్లోకి వచ్చాను. అమ్మ వ్రేళ్ళమధ్య ఏవో కాగితాలు నలిగిపోతున్నాయి.

"దీని సంగతేమిటో మొదట నేనే చూస్తాను, ఆ తరువాతి వంతు మీ అన్నయ్యది. అతడు చదివి పదిలంగా నీ చేతికిస్తాడు. అందాకా నువ్వా ఇక్కడే కూర్చో."

మరబొమ్మలా కుర్చీ కంటుకపోయాను.

ఏదో డాక్యుమెంటును శ్రద్ధగా పరిశీలిస్తున్న న్యాయవాదిలా కూర్చుంది అమ్మ. బారెడు దూరంలో వున్నా ఆమె వుచ్ఛ్వాసనిశ్వాసాల సవ్వడి స్పష్టంగా వినిపిస్తోంది. ఎంతో వుద్విగ్నతను గలిగించే వృత్తాంతమైతే గానీ, ఆమె అలా గస పోసుకోవడం జరుగదు. కోపము, వుద్వేగము, సంభ్రమము మొదలైన భావాలు కలిగినప్పుడు మాటిమాటికీ కళ్ళద్దాలు సర్దుకోడం ఆమె వాడుక. పైకి లాగి పట్టుకున్నట్టు నిశ్చలమై పోయే ముకుపుటాలతో, కనురెప్పలతో ఆ ముఖం బిర్ర బిగుసుకుపోతే, అది ఆమెకు కలుగుతున్న ఆశ్చర్యానికి గుర్తు. నిమిషానికొకసారి ఆమె కళ్లజోడు సర్దుకుంటోంది. పేజీ త్రిప్పబోతూ అంతలో ఆ విషయం మరచిపోయినట్టు ఆమె కళ్ళు మూసుకుని ఆలోచనలో పడిపోతుంది. తన నమ్మకాలన్నీ వమ్మయి పోయినట్టు, ఆశలన్నీ నిరాశలై పోయినట్టు ఆమెలో వేడి నిట్టూర్పులు గూడా ప్రారంభమయ్యాయి.

ఆమె చదువుతుంటే చదువుతున్నట్టుగా లేదు. అన్నయ్యను గూడా కలుపుకుంటే అది మా పాలిటికో క శిక్షగా వుంది. మధ్యమధ్యలో ఒకటి రెండుసార్లు కాగితాలను అవతలికి తీసి ఆమె మాపైకి బరపిన చూపులు ఇదివరకు నాకు అపరిచితాలు. చూపుల్లో అలాంటి వెటకారము, అపహాస్యము ప్రతిబింబింపవచ్చునని నాకు తెలియదు.

చదివి ముగించిన తరువాత ఆ కాగితాలను అన్నయ్య చేతి కందించేపాటి ఓపరికం గూడా అమ్మకు లేకపోయింది. ఆమె ఒడిలో పడివున్న కాగితాలు క్రిందికి కొట్టుకపోయి అన్నయ్య చేతికి దొరకడానికి పైన తిరుగుతున్న ఫేనే ఉపకరించింది.

ఒకటి, రెండు పేజీలు చదివేసరికి అన్నయ్య ముఖం వెలవెల పోవడం గమనించాను. అంతకూ, ఇంతకూ ఆశ్చర్య పడడం అన్నయ్య స్వభావం గాదు. అలాంటివాడు అయిదారు పేజీలు చదివి ముగించేసరికి తల దిమ్మెక్కి-పోయినట్టుగా పడుకున్న కుర్చీలో అలాగే సొమ్మసిల్లిపోయాడు. పై కప్పుకేసి చూస్తున్న అతడి కళ్లు క్రమక్రమంగా మూతబడిపోసాగాయి.

గబగబా గదిలోకి వెళ్ళి అమ్మ ఫ్లాస్కు తీసుకొచ్చింది. వేడివేడిగా ఓ కప్పు కాఫీ త్రాగాక పరిసరాల్ని ఒకేసారి కలయ జూచిన తరువాత గానీ అన్నయ్యకు తన చుట్టూరా వున్నది మామూలు ప్రపంచమే నన్న స్పృహ కలిగినట్టు లేదు. అతడు యంత్రంలా లేచి నిలబడ్డాడు. చీకటిదారిలో అడుగులు వేస్తున్నట్టుగా తన గదిలోకి వెళ్ళి వెనుకనుంచీ దభాలున తలుపు వేసుకున్నాడు.

నే నా కాగితాలను చదవడం ప్రారంభించేసరికి హాల్లో ఎవ్వరూ లేరు.

"ఒక్కొక్కప్పుడు కల్పనకంటే వాస్తవమే విస్మయావహంగా వుంటుందని విజ్ఞులు చెబుతారు. నా జీవిత గాథనే అందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు...

అందుకే దీన్ని ఉత్తరంగా గాకుండా కథలా వ్రాయడమే సముచితమనిపించింది.

నా జీవితగాథే అయినా యిది నా ప్రయోజకత్వంతో నేను మలచుకున్నదేమీ గాదు. కొన్ని పరిస్థితులు, కొందరు వ్యక్తులు మలచిన జీవితం నాది. అందుకనే నాయకత్వాన్ని నా పైన వేసుకోకుండా ఇందులోని ఒక పాత్రనుగా ఈ గాథ చెప్పుకుంటున్నాను.

నాణెమొక్కటే అయినా దానికొకవైపున బొమ్మా, మరొకవైపున బొరుసు వున్నట్టుగా ఈ జీవితగాథకు సైతం రెండు ముఖాలున్నాయి. ఒకటి యథార్థం. రెండోది కల్పితం.

కల్పనాగాథలోని ప్రకాశం అదృష్టవంతుడు. అతనికి సేలం జిల్లాలో సుక్షేత్రాలున్నాయి. అతడి నాన్నగారికి దక్షిణదేశ మహానగరాల్లో వ్యాపారాలున్నాయి. లౌకిక విషయాలకు దూరంగా ఋష్యశృంగుడు నివసించిన రమణీయ కాననసీమలా, లేమి వాసనైనా సోకని సంపదల లోకాలత నివి. ఇరుసు విరిగి కాలచక్రం ఆగిపోయినా సరే నెల పుట్టీ పుట్టకమునుపే మనియార్డరు అతని చేతికి వస్తుంది. సహపాఠకుల దృష్టిలో ప్రకాశంతో స్నేహం కాంక్షింపదగినది. అత

నితో సాన్నిహిత్యం గౌరవప్రదమైనది. కానైతే అది చాలా మందికి దుర్లభమైనది కూడా!

వాస్తవం కల్పనలా హృదయంగమంగా లేకపోతే అందుకు ప్రకాశం పూచీదారుడు కాదు గానీ, నిజ జీవితంలో నేమో యినుపగజ్జెల తల్లికి ముద్దుబిడ్డ డతడు. సేలం జిల్లాను గురించి అతనికి తెలిసింది పొరుగు రాష్ట్రంలో అదొక జిల్లా అని మాత్రమే! జిల్లా ఏదైతేనేమి గానీ అతనిది తాలూకా పటంలోనైనా కనిపించని ఓ మారుమూల కుగ్రామం. సీమ బొగ్గు రాసిపోసినట్టున్న నల్లరాళ్ళ గుట్టల నడుమ, చీకిపొదల చిట్టడవుల మధ్య, ఎగుడు దిగుడుగా పడివున్న ఎర్రటి మెట్ట పొలాలే జీవనానికాధారంగా కాలం వెళ్ళబోస్తున్న ఆ పల్లెటూరిలో వున్నదల్లా పాతిక పూరికొట్టాలు. కొట్ట మనిపించుకోడానికైనా తగని ఓ పూరిపాకలో చీకటి, గాలి, వాన, చలిలాంటి ఈతిబాధలన్నీ ఒక్కుమ్మడిగా లోకంపైకి మోహరించిన ఒకానొక రాత్రి సమయంలో జన్మించాడు ప్రకాశం. పుట్టిన ప్రతిబిడ్డకూ పేరు పెట్టాలన్న పట్టింపు లేకపోవడం అటుండగా, పుట్టినబిడ్డలందరూ చనిపోతూ వచ్చిన ఆ కుటుంబంలో రామన్నకు, సుబ్బులమ్మలకు పుట్టిన ఆ కడసారి బిడ్డ పురిటినాడు పెంటకుప్పలో పడవేసి మళ్ళీ ఇంటికి దెచ్చుకునే సాంప్రదాయంరీత్యా 'కుప్పయ్య' అన్న పేరుతో మునసబు గారి జనాభా రిజిష్టరులో చోటుచేసుకున్నాడు.

ఆ కుర్రవాడికి అయిదేళ్ళొచ్చేసరికి తల్లిమాత్రం మిగిలింది. ఆ తల్లికా పూరిపాకతోబాటుగా రెండు బర్రెగొడ్లు మిగిలాయి. కూలీనాలీ చేసుకుంటూ పొట్టబోసుకోడం కన్నా

బ్రతుకు తెరువు లేని ఆ అనాథకు ఇసుకలో పడుకుని పసిడి మేడలు కట్టడం అవివేకమని తెలియదు. చిలిపిగా మాట్లాడుతూ, చిన్న చిన్నగా పదాలు పాడుకుంటూ తన కళ్ళకు పండువగా పెరుగుతున్న కుర్రవాడిపైన లేనిపోని ఆశలు పెట్టుకోడం భావ్యంగాదని ఆమెకు తెలియజెప్పినవాళ్ళు లేరు. పైగా ఆ పసివాడి లేతబుర్రలో పైపైకి ఎగ్రబాకి పోవడానికి కావలసిన శుభలక్షణాలు నిక్షిప్తమై వున్నాయని, ఆమె ఆశాంకురాలకు పాదులు కట్టింది లోకం. అక్కడికి పదిమైళ్ళ దూరంలో వున్న పుట్టింటికి పంపి, ఆ వూరి పలుకూటంలో చేర్పించింది. పంతులు పాపయ్యగారికి ప్రీతిపాత్రుడు గావడంతో తన బిడ్డ భవిష్యత్తు కింక అడ్డే లేదని తలపోసింది. మేనమామల అదుపు క్రింద, అత్తగార్ల సాధింపుల క్రింద నలిగిపోతున్న ఆ కుర్రవాణ్ణి ఆదరంతో దగ్గరకు చేరదీసి అభిమానంతో విద్యాబుద్ధులు నేర్పించారు పాపయ్యగారు. "ఒరే కుప్పయ్యా! ఏం పేరురా నీది! బంగారంలాంటి కుర్రాడివి. ఎవడ్రా నీకీ పేరు పెట్టింది? ఇప్పుడు గాదులే, హైస్కూలుకు పంపించేప్పుడు నీ పేరు నెలా మార్చేస్తానో చూద్దువుగానీ వుండు" అనే వారు పాపయ్యగారు.

"ఎలా పంపగలరండీ మేష్టరుగారూ! బస్తీలో చదువులంటే మాటలా! అందులోనూ దిక్కూ దరి లేని కుర్రాడాయె" అంటూ ఎవరైనా అడ్డు తగిలితే పాపయ్యగారు వాళ్ళపైన విరుచుకపడేవారు. "ఐతే మీరనేదేమిటి? చదువుకోగలిగిన వాడు చదువుకోడానికి వీల్లేకపోతే ఇక లోకంలో చదువులెందుకయ్యా వుండటం! వీడెలా చదువుకోలేడో చూస్తాను.

నాకు తెలుసు. ఆ తల్లి నాలుగిళ్ళలో అంట్లుదోమి తన బిడ్డను చదివించుకో గలదు. ఏమనుకుంటున్నారో మీరు! పాపయ్యగారి శిష్యుడంటే హైస్కూలు హెడ్మాస్టరుగారు కళ్ళ కద్దుకుంటారు..."

పాపయ్యగారిది సిద్ధవాక్కు. ప్రకాశమన్న నామాంతరంతో ఆయనగారి శిష్యుడు హైస్కూల్లో చేరాడు. ఒక్కొక్క మెట్టే పైకెక్కుతూ ప్రతి తరగతిలోనూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. వార్షికోత్సవ సందర్భంలో బల్లపైని బహుమతులను తన చిన్న చేతులతో దోచుకపోతున్న ఆ కుర్రవాడివైపు చూస్తూ ముందరవరసల్లో కూర్చున్న పుర ప్రముఖులు వీడి తలిదండ్రు లెంతటి అదృష్టవంతులో గదా అని విస్తుపోయేవారు. సభాసదుల కందరికీ వెనుక, యినుప కమ్మీల గేటు దగ్గర గోడ క్రీనీడలో నిల్చున్న ఓ శిథిలాకారమే ఆ కుర్రవాడి మాతృదేవత అని వాళ్లకేం తెలుసు?

చదువులో ప్రకాశాని కొక యోగ్యతాపత్రాన్ని ప్రసాదించిన ఆ రేళ్ళ నగరవాసం సుబ్బులమ్మ ఆరోగ్యంపైన తీవ్రంగా దెబ్బతీసింది. ఐనా అందుకామె దిగులుపడిందిగాదు. తాను చేయగలిగినదంతా చేసింది. వాడి తెలివితేటలు వాడి కొచ్చేశాయి గనుక ఇక తాను కొడుకును గురించి బెంగ పెట్టుకోనక్కరలేదు. అన్నింటికీ పైన భగవంతుడున్నాడు. ఆ సంతృప్తితో ఆమె స్వగ్రామానికి వెళ్ళిపోయింది. తాను సంపాదించుకున్న సర్టిఫికెట్టు తనకు బువ్వపెట్టగలదన్న నమ్మకంతో ప్రకాశం పట్టణంలో నిలచిపోయాడు. పదహారేళ్ళ పసివాడికి ప్రభుత్వంలో కొలువులు దొరకవు. కొంతకాలం

ప్రత్యేక సంస్థల వెంట తిరిగాడు ప్రకాశం. రేపురా మాపురా అని వాయిదాలు పెట్టడం, తరువాత ముఖాలు తప్పించడం, అలా కాదని నిలదీసి నిక్కచ్చిగా అడిగితే నీముఖం నువ్వే ఉద్యోగం చేయగలవని చులకనగా మాట్లాడటం, ప్రకాశాన్ని కృంగదీశాయి. ఒకటి రెండు చోట్ల ఉద్యోగం లాంటిది దొరికినా దానికి అంటి పెట్టుకుని వుండలేకపోయాడు ప్రకాశం. ఎదుటివాడి నిస్సహాయతను పసిగట్టి, వాడే పని ముట్టుకన్నా హీనంగా, బానిసతో సమానంగా చూడటం అతడి హృదయాన్ని గాయపరచింది. నీతికీ నిజాయితీకి, ప్రతిభకు ప్రవర్తనకూ మన్నన లభించే బ్రతుకు తెరువుకోసం అన్వేషిస్తూ అతడు దేశంపైన బడ్డాడు. ఆత్మగౌరవానికి అఘాతం కలగకపోతే చాలు, తనెలాంటి పనిచేయడానికైనా సిద్ధమే నన్న నిర్ణయానికి వచ్చాడు. అవయవాలు కదలకుండా, దుస్తులు నలగకుండా కుర్చీకి తను వప్పగించి పై వాళ్ళ దగ్గర రోజుకు పది సార్లు మెత్తగా చీవాట్లు తినే వుద్యోగాల కంటే కాయకష్టం చేసి బ్రతకడంలో నామోషితనం లేదని గుర్తించాడు. కొన్నినాళ్లు బరువులు మోశాడు. రిక్షాలు లాగాడు. హోటళ్ళలో పనిచేశాడు. ఏ పని చేస్తున్నా తనీ పని చేయడం కోసం పుట్టలేదేమో నన్న అనుమానం ఒకటి అతణ్ణి వెంటాడుతోంది. మరి దేనికోసం తన పుట్టుక? ఏ రంగంలో తనకు రాణింపు? తీరిక దొరికినప్పుడల్లా గ్రంథాలయాల్లోకి వెళ్ళి బీరువాలవైపు చూస్తూ కూర్చునేవాడు. ఆ పుస్తకాలతణ్ణి ఊరించేవి. బసకు తిరిగివెళ్ళి, పెట్టె దెరిచి, దుమ్ము దులిపి పైకి తీసిన సర్టిఫికెట్టులో ప్రత్యక్షరాన్నీ పరి

శీలిస్తూ కాలం గడిపేవాడు. విద్యాభ్యాసం ఒక వ్రతంలాంటి దైతే తాను వ్రతభ్రష్టుడు, విద్యార్జన ఒక యోగంలాంటి దైతే తాను యోగభ్రష్టుడు.

నిండుగా నాలుగేళ్ళు పరిస్థితుల సుడిగాలిలో ఎండు టాకులా గిరికీలు కొడుతూ బ్రతికాడు ప్రకాశం. పడిన కష్టాలు అతని మనసుకు బలాన్ని చేకూర్చాయి. బ్రతుకంటే ఏటివాలు వెంట పూలపడవపైన షికారు గాదు. అది ఏటి కెదురీత. సుడిగుండాల్లో మునక. జలచరాలతో ఘర్షణ. పరిస్థితుల పైన తిరగబడి గెలుపొందని మానవుడికి చరితార్థత లభించిన నిదర్శనాలు ప్రపంచ చరిత్రలోనే లేవు. తాను చదువుకోడం కోసమే పుట్టాడు. ఎలాగైనా తాను చదువు కావాలి...

మనసు మార్గాలను అన్వేషింపసాగింది.

తెలుగురాజుల దానజలధారలో గిరులు తెప్పలై తేలిపోయిన దినాలు గావు. ఐనా లోకంలో వదాన్యులు లేక పోలేదు. ఈనాటికీ దేవాయతనాలు నిర్మింపబడుతున్నాయి. పరోపకార పారీణత మానవజీవితంలోనుంచీ పూర్తిగా లుప్తమైపోయే దుర్దినాలు రాకపోవచ్చు నన్నదే ఆశావాదుల విశ్వాసం. ఎటొచ్చీ ఆర్థికంగానే సాయం చేయడానికి సంసిద్ధతను ప్రకటించే దాత లెక్కడున్నారన్నదే తనకు తెలియని సంగతి.

వాకబు చేయసాగాడు.

అప్పుడే తన జీవితంలో మొదటిసారిగా ప్రకాశం రామదుర్గం అన్న ఊరిని గురించి విన్నాడు. ప్రకాశానికి కొన్ని

వందల మైళ్ళ దూరంలో ఉన్న ఊరది. కానీ, కీర్తికాంత పయనించలేని దూరాలు లేవు.

లేడికి లేచిందే పరుగైంది! రెక్కలు గట్టుకుని వెళ్ళి రామదుర్గంలో వ్రాలిపోయాడు ప్రకాశం.

బయల్దేరిన వేళా విశేషం మంచిదికాదేమో ననిపించింది-వెళ్ళిన సమయానికి రామభద్రయ్యగారు ఊరిలో లేరు గనుక!

పాతకాలంనాటి మండువాలోగిలి ఎదుట, పది పదిహేను అంకణాల మేరకు పొడుగ్గా వేసిన పందిరి క్రింద నిల్చున్నాడు ప్రకాశం. ఉదయం ఎనిమిది గంటలవేళ, ఒకటి రెండుసార్లు ప్రకాశం గుమ్మంలోనుంచీ లోపలికి చూడటానికి ప్రయత్నించాడు. ఆ మహిడిలో మనుషులు నడయాడుతున్న చిన్నెలే లేవు. అంత పెద్ద చుట్టు భవంతిలో మనుషు లెక్కడున్నారో ఎలా తెలుస్తుంది? ఏం చేస్తున్నారో ఎలా తెలుస్తుంది? వాళ్ళు లోప లెక్కడో మాట్లాడుకుంటే ఆ సవ్వడి బయటి కెలా వినిపిస్తుంది? పందిరి క్రింద మాత్రం జీతగాళ్ళ హడావిడి ఉండి ఉండి చెలరేగి చల్లారుతోంది. సేద్యగాళ్ళు, గుమాస్తాలు, ఆలకాపర్లు వెలుపలి నుంచీ ఏవో వర్తమానాలను మోసి తెచ్చి. లోపలినుంచి ఏవో ఆజ్ఞలను స్వీకరించి తొందర తొందరగా వెళ్ళిపోతున్నారు. క్రొత్త వ్యక్తి ఒకడు అక్కడ నిల్చున్నాడన్న విషయం వచ్చిపోతున్న వారిలో మచ్చుకొక్కరైనా గమనించినట్టు లేదు. కారణ మేమై వుంటుంది? ప్రకాశం తనవైపొకసారి చూచుకున్నాడు. బస్సు ప్రయాణం మూలంగా తన దుస్తులు మాసి మన్నుగొట్టుక

పోయాయి. తల రేగిపోయింది. పడుకోడానికి చోటు దొరకక రాత్రంతా నిద్రలేక పోవడంతో కళ్ళు మండుతున్నాయి. ఈ పిచ్చి వాలకంవల్ల ఎదుటివాళ్ళకు తనపట్ల సదభిప్రాయం ఏర్పడవచ్చు నన్న నమ్మకం కలగడంలేదు. కానీ మార్చు కోడానికి తన దగ్గర దుస్తులు లేవు. అటువైపునుంచీ రామ భద్రయ్యగా రెప్పుడొస్తారో తెలియదు. అందాకా ఏం చేయాలో తోచదు. ఇంతదూరం వచ్చి ఆయనను కలుసుకో కుండానే వెళ్లిపోవడానికి మనస్కరించదు.

ఎరుపుదనం విరిగిపోయిన నీ రెండ బాగా పదనుపెట్టి గాలిలో ఝుళిపిస్తున్న కరవాలంలా తళతళలు వెలిగ్రక్కు తోంది. పందిరిగుంజ కానుకుని నిశ్చలంగా నిల్చున్న ప్రకాశం మధ్యాహ్నం వరకైనా అలాగే నిల్చుండిపోయే పట్టుదలలో నుంచీ నీ రెండలోకి శూన్యంగా చూస్తున్నాడు.

మేడపైన గోడ గడియారం, దూరంగా గుడిలో నుంచీ నెమలి క్రేంకారం, కొట్టాల్లో నుంచీ దూడల అంబా రవం—ఇంతకు మించిన అలికిడి వినరాకుండా ఆ భవనం చుట్టూ పేరుకున్న స్తబ్దతలో ప్రకాశం తానూ ఒక పందిరి గుంజలా నిల్చుండి పోయాడు.

గంట పదిన్నర. దగ్గర్లో ఎక్కడో కూనిరాగంతో సినిమాట్యూను, బూట్ల శబ్దం ఆ ట్యూనుకు దరువులు పలుకు తుండగా ఓ అబ్బాయి వెలుపలికి వచ్చాడు.

"మిస్టర్! ఏ ఊరు?"



కథా నిలయం
2913
శ్రీకాకుళం

ప్రకాశం ముఖంలో ఆశాజ్యోతి వెలిగింది. అతడు సమాధానం చెప్పుకున్నాడు.

"ఇక్క డెవరికోసం?"

"అయ్యగారి కోసం."

"ఎందుకూ?"

కారణం చెప్పాడు ప్రకాశం, పాంటు జేబులో నుంచి సర్టిఫికెట్లు తీస్తూ.

"నీ దేనా సర్టిఫికేటు?"

తటాలున చేతికి తీసుకున్నాడు. పేజీలు త్రిప్పుతూ ఎర్ర సిరాతో మార్కులు గుర్తించిన చోట ఆగిపోయాడు. తల పైకెత్తి ప్రకాశంవైపు చూచాడు. మళ్ళీ మార్కుల వైపు......

"మరి...మరి..." ఉపక్రమణికలో తొట్రుబాటు పడిపోతున్నాడు ప్రకాశం.

అప్పుడొక విచిత్రం జరిగింది. లోపలి నుంచీ పిలుపు లాంటి దేదీవినిపించ లేదని ప్రకాశం తన శ్రవణేంద్రియాల పైన ఆనపెట్టి చెప్పగలడు. కానీ అలాంటి పిలుపేదో శ్రవణ గోచరమైనట్టు "ఇదిగో వస్తున్నా" అంటూ కేకపెట్టి ఆ అబ్బాయి తుర్రున లోపలికి జారిపోయాడు.

ప్రకాశం హతాశుడై పోలేదు. ఒకవేళ తన చెవులే తనను మోసగించాయేమో! కాకపోతే ఆ అబ్బాయి అలా 'కీ' ఇచ్చిన మరపిట్టలా ఎగిరిపోవలసిన అవసరమేమీ కనిపించదే!

గంట పదకొండు కావస్తోంది.

ఈసారి మరింత ఆశావహమైన సంఘటనే ఎదురైంది ప్రకాశానికి!

"ఒరేయ్ సుబ్బన్నా! ఏడీ సుబ్బన్న? నరిసింహులైనా వున్నట్టా, లేనట్టా?" అంటూ ఈవలికి వచ్చిన ఆ ఇంటి ఇల్లాలు పందిరి క్రింద మనుషులకోసం కలయజూస్తూ వరాండా అంచున నిల్చుంది. ఆమె అలా వెలుపలికి రావడమే ప్రకాశానికి ఆశావహమై వుండగా, మరింత ప్రోత్సాహజనకంగా "ఇక్కడెవరో బాగా మార్కులొచ్చిన కుర్రాడున్నాడుట! నువ్వేనా అబ్బాయ్!" అంటూ సర్టిఫికెట్టు చేతికి తీసుకుంది.

కోరిన కొండపైన వానమబ్బు లెక్కుతున్నట్టే వున్నాయి ప్రకాశానికి!

సమయం దొరికింది గదా అని దొరికిన వెంటనే బాకా లూదడం బాగుండదు గనుక, సాకల్యంగా ఆమె పరీక్షా ఫలితాలను గమనించేదాకా ప్రకాశం ఓపిక పట్టదలచుకున్నాడు.

"చూడండమ్మగారూ! మరేమో...మా ఊరిక్కడికి..."గొంతుకలో కొట్లాడుతున్న భావాలను మాటల్లోకి అనువదించడంలో, విఫలుడై పోతున్నాడు ప్రకాశం.

ఆమె తల పైకెత్తి ప్రకాశం కేసి చూచింది. చాచి పట్టుకున్న ఆమె చేతిలో నుంచీ క్రిందపడిపోకుండా తన సర్టిఫికెట్టును అందుకో గలిగాడు ప్రకాశం. ఆమె ప్రకాశం కేసి చూచిన చూపుల్లో ఆశ్చర్యం లేదు. ఆర్ద్రత లేదు. అవి

చప్పగా, నిర్వికారంగా వున్నాయి. ఆ చూపులాగే మరొక కోణంలోకి మళ్లీ అక్కడ తమ కెదురైన ఆ గంతకుడి కొకడికి ఢీకొన్నాయి. "ఒరేయ్ నారిగా! అప్పుడే అన్నాలకు వేళయిందట్రా నీకు! నరసింహులు తోటలో వున్నట్టున్నాడు. వెళ్లి ఒకసారి అతణ్ణి ఇంటికి వచ్చి పొమ్మని చెప్పు" అంటూ ఆమె మందగమనంతో గృహాంతర్భాగంలోకి వెళ్లిపోయింది.

ప్రకాశం నిశ్చేష్టుడై పోయాడు.

ముదిరిపోతున్న మిట్టమధ్యాహ్నపు టెండల్లో చండ్ర నిప్పులు రాలుతున్నాయి.

వడగాడ్పులు ఒడలికి సోకి చల్లబడి చెమటలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఇందాకా అంతర్థానమై వుండిన సమస్య ఒకటి ఇప్పుడు క్రొత్తగా ప్రకాశాన్ని సమీపిస్తోంది.

రామభద్రయ్యగారిని కలుసుకుంటే, వచ్చిన పని సానుకూలమయ్యే సూచనలు కనిపిస్తే, ఆ తర్వాత నింపాదిగా భోజన సదుపాయాలను గురించి ఆలోచించవచ్చుననుకున్నాడు ప్రకాశం. పళ్ళు దోముకోడమైతే తెల్లవారుజామున్నే జరిగింది గానీ, అప్పటినుంచీ మంచినీళ్ళతోనైనా కుక్షిని వుపలాలించలేదు.

ఎక్కడో ఓ పూటకూటి ఇంట నిన్న సాయంకాలమెప్పుడో తిన్న తిండి. అది కొలత భోజనం. కొరత భోజనం గూడా!

గిర్రున తిరుగుతున్న ప్రకాశం కళ్ళకు ఎండల్లో ఎండమావులు కనిపిస్తున్నాయి.

కోరివచ్చిన సహాయం లభించకపోతే మానే సాద రంగా ఒక పూట భోజనానికైనా నోచుకోక పోతున్న తన దౌర్భాగ్యాన్ని గురించి ఏమనుకోగలడు ప్రకాశం?

క్షుధార్తి ఎదుట అభిమానం గడ్డిపోచకన్నా హీన మైనది.

ఈసారి ఎవరైనా కనిపిస్తే నోరు దెరచి అడిగేయా లని అనుకుంటున్నాడు ప్రకాశం.

గంట రెండు!

గ్రీష్మాతపంలో తిరిగి వచ్చిన కుక్కలు కొన్ని పందిరి క్రింద పడుకుని చొంగలు కార్చుకుంటున్నాయి. సీరెత్తిన నిమ్మలా నిదురబోతున్న ఆ గృహావరణలో మధ్యాహ్న మయ్యేసరికి జన సంచార పూర్తిగా తగ్గిపోయింది. వంట గదుల్లో సాయంకాలం ఉపాహారాలకోసం ప్రయత్నాలు ప్రారంభమయే సమయం!...ప్రేగులు మెలికలు తిరిగిపోతున్న ఆకటి బాధలో ప్రకాశానికి మతి పోతోంది.

అప్పుడు మరొక విచిత్రం జరిగింది—

ఉదయం పది గంటలప్పుడొకసారి వెలుపలికి వచ్చి ప్రకాశాన్ని పలకరించి పిట్టలా లోపలి కెగిరిపోయిన ఆ అబ్బాయి మునిగాళ్ళ పైన అడుగులు వేసుకుంటూ గోడ వెంబడే నడిచివచ్చి సింహద్వారంలో నుంచీ ఈవలికి తొంగి చూచాడు. ఉదయాన్ననగా ప్రత్యక్షమైన ఆ గంతకుడు ఇంకా అక్కడే పడిగాపులు పడుతూ వుండవచ్చునన్న తన అనుమానం నిజమైందేమో, ఎలా వచ్చిన వాడు అలాగే

వెనుదిరిగి చప్పుడు గాకుండా చల్లగా మటు మాయమై పోయాడు.

రెండడుగులు ముందుకు వేసిన ప్రకాశం అయిదు నిమిషాల వరకూ అప్రతిభుడై నిల్చుండి పోయాడు.

ఆ తరువాత నీరసించిపోయిన అతడి శరీరం ముందుకు కదిలింది. పందిర క్రింది నుంచీ వీధిలోకి వీధిలోనుంచీ రోడ్డు పైకివచ్చాడు. రక్త చందనాన్ని ఎండించి దట్టంగా నెరిపి నట్టున్న ఆ ఎర్రటి మట్టి బాటపైన కాళ్ళీడ్చుకుంటూ నడవ సాగాడు ప్రకాశం. ఇంకా తొలిముంగారు వానలతోనైనా నాలుక తడుపుకోని పరిసర ప్రకృతి ఏదో దారుణమైన భావాన్ని ప్రకటిస్తున్న తైలవర్ణ చిత్రంలా భీభత్సంగా వుంది. ఆఖరు గరికిపోస గూడా ఎండి పోవడంతో ఆవులు కలమంద పట్టల్నే కొరుకుతున్నాయి. బాట కిరువైపులా ఆకులు రాల్చు కున్న చింత చెట్లు కాకులకైనా ఆశ్రయ మివ్వలేనంతబోసిగా తయారయ్యాయి.

ప్రకాశానికి ఒక్కొక్క ఫర్లాంగు ఒక్కొక్క యోజ నంలా వెనక్కు వెళ్తోంది.

పడమటి కొండల కొలిమిలో ఎర్రగా కాలిన గంగా ళంలా ఉన్న సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని సింహావ లోకనం గావించుకుంటూ వికటహాసం చేస్తున్నాడు.

కష్టాలు ఒంటరిగా రావని చెబుతారు పెద్దలు. విచిత్ర సంఘటనలు సైతం అలాంటివేనేమో! దుమ్మును పైకెగజిమ్ము కుంటూ నీలిరంగు కారు ఒకటి ప్రకాశానికెదురుగా వస్తోంది. ప్రకాశం ఆగిపోయాడు. ఒక క్షణం ఆగాడు. రెండు క్షణాలు

ఆగాడు. మరో క్షణాన అతడి బుర్రలో ఓ మెరుపు మెరిసింది. వైదొలగి కారుకి దారి అవ్వవలసిన ప్రకాశం, ఇంకా రెండడుగులు ముందుకే వేసి, కారు కెదురుగా నిలబడి చేతిని రెక్కమానులా అడ్డంగా చాపేశాడు.

సడన్ బ్రేకుతో కారు ఆగిపోయింది.

ప్రకాశం కారు దగ్గరికి పరుగుదీశాడు.

"ఎవరబ్బాయ్! ఏం కావాలి?"

రామభద్రయ్యగారంటే వీరేనని ప్రకాశాని కొకరు తెలియ జెప్పవలసిన అవసరం లేకపోయింది. మాటల్లోని ఆదరణ, ముఖంలోని ప్రసన్నత ఆవిషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి. లోకంలో వ్యాపించిన ఆయన కీర్తికీ, ఆ క్షణాన కారులో కనిపించిన మూర్తికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని ప్రకాశం అరక్షణంలో పోల్చుకోగలిగాడు.

"నమస్కారాలు బాబూ!" చేతులు జోడించాడు ప్రకాశం— "తమకోసమే వచ్చాను..."

"ఐతే వెళ్ళిపోతున్నావేమబ్బాయ్! అయిదు గంటలకల్లా తిరిగొస్తానని చెప్పానే! నా కోసం ఎవరైనావస్తే, అందాకా ఉండవలసిందని చెప్పమన్నానే! నీ కెవరూ చెప్ప లేదేమిటి?"

ప్రకాశం నిరుత్తరుడై పోయాడు.

"నీ వాలకం చూస్తే నువ్వు మధ్యాహ్నం భోజనం చేసినట్టులేదు. అవునా అబ్బాయ్?" ఈసారి ఆయన మరింత సూటిగా ప్రశ్నించాడు.

ఎదుటివారిచేత సత్యాన్ని చెప్పించే శక్తి ఏదో

ఆయనలో ఉంది. ఎంతగా తన కిష్టంలేకపోయినా ప్రకాశం నిజం చెప్పక తప్పిందిగాదు.

రామభద్రయ్యగారి ముఖంలో ప్రకాశానికి ఓ కదలిక కనిపించింది. ఫాలతలం వెడల్పు హెచ్చి, కనుబొమలు పైకి లేచి, మునిపంటితో పెదవిని కొరుక్కున్న ఆ ముఖభంగిమలో విసురుగా పొరాడుతున్న భావవీచిక వెనుక రామభద్రయ్యగారి ఊహ లేమిటో ప్రకాశానికి తెలియదు. కానీ ఆయన ఏవో కొన్ని భావాలను అంతరంగంలో దాచుకున్నాడని మాత్రం ప్రకాశం గ్రహింపగలిగాడు.

కార్యక్రమంలో ఒక అంశాన్ని వదిలిపెట్టి మరో అంశంలోకి వచ్చినట్టుగా "వచ్చిన పనేమిటో చెప్పు" అన్నా రాయన.

ప్రకాశం మనవిచేశాడు—తాను నిరుపేద. ఇంతవర కైనా చదువుకోగలిగాడంటే అందుకు కారణం ఉదారుల దయా విశేషం. తను చదువు మానేసి నాలుగేళ్ళయింది. మంచి ఉద్యోగం దొరికింది గాదు. ఈ నాలుగేళ్ళలో తాను పడరానిపాట్లు పడ్డాడు. చదువుకోవాలన్న కోరిక అదొక తీరని వేదనగా తనను వెన్నంటి తరుముతోంది. అది దురాశ అని, అందని పండ్లకు అర్రులు చాచడమనీ తన మనసును తాను మందలించుకోక పోలేదు. కానీ ఆశ అణగారిపోయింది గాదు. అందువల్లనే తనిలా రామభద్రయ్యగారికోసం రావడం జరిగింది. ఇదే చిట్టచివరి ప్రయత్నం.

వింటూ కూర్చున్నారు రామభద్రయ్యగారు. విన్న

తరువాత సర్టిఫికెట్ నొకసారి త్రిప్పి చూచాడు. తటాలున తలుపు తెరచుకుని, కారు దిగి, రోడ్డుపైకి వచ్చేశారు.

ఆరడుగుల భారీమనిషి రామభద్రయ్యగారు. అందుకు దగ్గట్టుగా ఆయన ఆజానుబాహులు. నల్లగా బొద్దుమీసాలు, కనిపించగానే చూపరులకు ఒళ్ళు గగుర్పాటు చెందే ఆకారం ఆయనది! ఆయన మాటల్ని వినడం జలపాతం క్రింద నిల్చునే అనుభవం లాంటిది.

"చూడబ్బాయ్! అన్నట్టు నీ పేరు ప్రకాశంగదూ! చూడు ప్రకాశం! మానవుడికి అంగబలంతోనూ అర్థబలం తోనూ అవసరం లేదని నేను చెప్పను. కానీ వాటికంటే మానవుడికి విశిష్టత నాపాదించేది ఆత్మబలం. ఆత్మబలం ఉన్ననాడు మానవుడు మేరు నగంలా మహోన్నతుడై అందని ఆదర్శాలు అవలీలగా అందుకోవచ్చు. నదీజలాలలాటి విద్యావిజ్ఞానాలను అంబుధిలా తనలో లీనం చేసుకోవచ్చు. ఈడ్చి కొలిస్తే అయిదున్నరడుగులైనా లేని బక్కపలచటి కుర్రాడివి నువ్వు. గట్టిగా గాలివీస్తే పదిబారల దూరంలో ఎగిరిపడేటట్టున్నావు. ఐనా శరీరబలాన్ని మించిన ఆత్మబలం నీలో వుంది. అదే నిన్నిక్కడికి తీసుకొచ్చింది. అదే నా కారును ఆగిపోయేటట్టు చేసింది. అదే నన్నిలా రోడ్డుపైన నిల్చోబెట్టింది. నేను నీకు సాయం చేయదలచుకున్నాను.."

పొగ చుట్ట వెలిగించుకుంటూ కొనసాగించారు రామభద్రయ్యగారు— "కానీ ఒక షరతు! నా నమ్మకానికి మూల్యం చెల్లించాలి నువ్వు..."

"మూల్యమా!" ప్రకాశం కంగారు పడిపోతున్నాడు.

"మరేం లేదు. మా అబ్బాయి ఒకడున్నాడు. బొత్తిగా మందుడైతే నేను చింతపడేవాణ్ణి గాను. తెలివితేట లున్నాయి. ఉన్న తెలివితేటలను సద్వినియోగం చేసుకోడం వాడిచేతగాదు. వాడిని నిన్నూ, ఒకే కాలేజీలో చేర్పిస్తాను. ఎలాగైనా వాడు క్రమంగా చదువుకునేట్టు చూచే పూచీ నీది."

విభ్రాంతితో నిర్ఘాంత పడిపోతున్నాడు ప్రకాశం!

"తలకు మించిన భారంగా కనిపిస్తోందా ప్రకాశం! మరేం భయపడొద్దు. నీపైన నా కామాత్రం విశ్వాసం కుదిరింది. నువ్వు తలచుకుంటే నా కోసం ఈపాటి శ్రమను సునాయాసంగా భరించగలవు..."

జేబులోంచీ డైరీ పైకిదీశారు, రామభద్రయ్యగారు.

"నీ చిరునామా ఏమిటో చెప్పు! పదిహేనురోజుల్లో నీకు నా దగ్గర నుంచీ జాబొస్తుంది" అన్నారు.

స్వప్నంలాంటి సంఘటన అది! కలలన్నీ కల్లలే నంటారు. కానీ ఆ నా మధుర స్వప్నాన్ని అక్షరాలా నిజం చేసి చూపెట్టారు రామభద్రయ్యగారు. జాబు మాత్రమే గాదు. సరిగా ఆనాటినుంచీ పదిహేనోనాటికి బ్యాంకులో ఉన్న రామభద్రయ్యగారి ఖాతాలోనుంచీ నా పేరిటికి రెండు వందల రూపాయల మనియార్డరు గూడా వచ్చింది.

కళాశాల జీవితంలో ప్రకాశానికి సురేంద్రకు ఏర్పడిన స్నేహాన్ని గురించి చెప్పుకుంటే మిగిలిన కథ పూర్తవుతుంది. ఆర్ద్రతకు, ఆత్మీయతకు కాణాచిగా వెలసిన ఆ స్నేహానికి కొత్తగా వెలికితీయబడిన వాస్తవికాంశాలవల్ల ఆరని దెబ్బ

తగుల వచ్చునన్న సత్యాన్ని ప్రకాశం కాదనలేదు. కానీ విప్పి చెప్పక తప్పని పరిస్థితిలో ప్రకాశం తన నిజ స్వరూపాన్ని ఇలా ఆవిష్కరించి చూపెట్టుకోవలసి వచ్చింది.

అందుకే ఇందుబాలను చేబట్టడమనేది ప్రకాశం కలలోనైనా ఊహించలేని అదృష్టం.

అధిక ప్రసంగమని భావించకపోతే ఇక్కడొక చిన్న సంగతి మనవి చేసుకుంటాడు ప్రకాశం—కళాశాలలు నాటక రంగాల్లాంటివి. దేశం నలుమూలలనుంచీ విద్యార్థులక్కడికొస్తారు. వస్తూవస్తూ వేషానికి అవసరమైన దుస్తులను ట్రంకుల నిండుకూ తెచ్చుకుంటారు. శిరోజాలకు కావలసిన తైలాలను, ముఖానికి కావలసిన అర్ధరిపు ద్రవ్యాలను బజారులో అద్దాల బీరువాల్లో నుంచీ కొనుక్కుంటారు...రారాజు పాత్రధారి సాక్షాత్తు రారాజుగానే భావించడం నాటకశాలలో ప్రేక్షకులకు కలిగే భ్రమ. వాస్తవిక ప్రపంచంలో ఆ నటుని జరుగుబాటెట్టిది? మనస్తత్వ మెట్టిది? అన్న ఆలోచనకు ఆస్కారమే లేకుండా అతణ్ణి ప్రేమించి, అతడితో జీవితాన్ని పంచుకో దలచడంలో ఔచిత్యం కనిపించదు.

ప్రకాశం నటుడుగావచ్చు. మోసగాడు గావచ్చు. కానీ అతడు కర్తవ్యనిష్ఠుడు మాత్రం గాకపోలేదు. కృతఘ్నుడుగా ప్రవర్తించలేదు.

కృతజ్ఞత హృదయంలో ఉంచుకోదగిన భావమైతే, అది మాటల ద్వారా వెల్లడింపబడినంత మేరకు హృదయం ఖాళీ అయ్యే ప్రమాదముంటే, అలాంటి ప్రమాదానికి వెరచి ప్రకాశం వినమ్రుడై చేతులు జోడిస్తున్నాడు.''

# 4

"పొద్దు పడమటికి వాలిపోతోందిరా బాబూ! తెల్లవారెప్పుడో తిన్న తిండి. అదైనా ఏం తిన్నావు గనుక? అదేమిట్రా నాన్నా ఆకలివేయడం లేదా నీకు?" గడపలో నిల్చుని అమ్మ భోజనానికి పిలుస్తోంది.

నిజానికి ఆ పూట ఆకలి వేయడంలేదు నాకు! హృదయంవ్యాకుల తరంగ ఘూర్ణితమైనప్పుడుకొన్ని భౌతికావసరాలు విస్మరింప బడడం సహజమే! ఎండలోపడి రెండు మైళ్ళ దూరం నడిచివచ్చి తపాలా బంట్రోతు ఇచ్చిపోయిన ఉత్తరాన్ని అది నేను అయిదోసారి చదవడం! అందులో సంబోధన లేదు. సంతకం లేదు. పొడిగా ఏడెనిమిది వాక్యాలు మాత్రమున్నాయి.

"ఇంతకన్నా త్వరగా బదులు వ్రాయలేక పోయినందుకు కారణం చిరునామా తెలియకపోవడం. చిరునామా దొరికే విధానం కూడా నిన్న మొన్నటికిగానీ స్ఫురించ లేదు. నాలుగేళ్ళ క్రిందటి పెదబాబుగారి పాతడైరీలోనుంచీ కొండను త్రవ్వి ఎలుకను పట్టినంత సులభంగా దాన్ని సంపాదించడమైంది. తమ గుప్తదానాన్ని గురించి ఆ మాత్రం ఆధారమైనా మిగిల్చి పోయినందుకు పెదబాబుగారికి మా కృతజ్ఞత.

క్షమాపణ నివేదికలోని అంశాలనుబట్టి చూడగా ఇక్కడ ఉపకారమనేది ఇరుపార్టీలవారూ పరస్పరం ఇచ్చి పుచ్చుకున్న వ్యవహారమని విశదమైంది. కానీ కృతజ్ఞత ఎలాగూ హృదయంలో ఉంచుకోదగిన భావమని ఉల్లేఖింప బడింది గనుక, ఆ పని చేయడానికి మేము సైతం వెను కాడక తప్పడంలేదు!

ప్రస్తుతాంశానికి వస్తే అమ్మాయి అజ్ఞతలో వ్రాసిన ఉత్తరాలు కొన్ని అటువైపున్నే ఉండిపోయాయి. వీలయినంతత్వరగా వాటిని త్రిప్పి పంపితే,అంతకంటే మేము కోరదగినదేమీ లేదు.''

ఆ ఉత్తరం నాకు సకాలంలో చేరింది. సకాలమని ఎందుకన్నానంటే అప్పుడు నేను ప్రేమకు సంబంధించిన చిట్ట చివరి సత్యాన్ని గురించి ఏ నిర్ణయానికీ రాలేకుండావున్నాను. వచ్చిన జాబు ఆ నిర్ణయాన్ని తేల్చి చెప్పింది.

తీవ్ర ఝుంఝూమారుతంలో బుద్ధిదీపం వెలగవచ్చు ననుకునే ఆశావాదిత్వం ఎనభై నాలుగు లక్షల జీవరాసుల్లో ఒక్క మానవుడికి మాత్రమే ఉందేమో ననిపిస్తుంది. ప్రేమే దైవమనీ, అది త్యాగానికి మారుపేరనీ ఇత్యాదిగా లోకవ్యవహారంలో ఉన్న నిర్వచనాల నన్నింటినీ జాబితాలో నుంచీ తొలగించి, ప్రేమ అన్న పదానికి యువతీ యువకులు వివాహ బంధంతో ఒకరికొకరు చేరువగా వచ్చి జీవితాన్ని

గడప దలచుకోవడమేనన్న పరిమతార్థం ఇచ్చుకున్న తర్వాత నాలో ఒక ఆశ మిగిలి ఉండిపోయింది. నా నిజస్థితి తెలిసిన తర్వాత గూడా ఇందుబాల ప్రేమకు నేను పాత్రుణ్ణి కావచ్చునేమో నన్నదే నా అనుమానం. మరైతే ప్రేమ గుడ్డిదని ఎందుకన్నా రన్నదే ఆశకు ఆధారం. ఆ ఆధారం పునాది రాళ్ళతో సహా కదిలిపోయింది.

లేచి వెళ్ళి భోజనానికి కూర్చున్నాను. మర్రాకుల విస్తరిలో అన్నం పెట్టి అంతటితో నా సంగతి మరచిపోయి నట్టుగా అమ్మ పొయిదగ్గర కూర్చుంది.

"పచ్చడి వేశావు కావేమమ్మా" అన్నాను.

"ఉండరా బాబూ! నువ్వొచ్చావని తెలిసి పెద్దిరాజు గారు గిన్నె నిండుకూ నెయ్యి పంపించారు. కరగ బెడదా మంటే పొయిలో నిప్పు కనిపించడంలేదు."

కొయ్య పెట్టెలోనుంచి చేతి నిండుకూ కాగితాలు తీసు కొచ్చి ఆమె అగ్గిపుల్ల గీసి ముట్టిస్తోంది.

"అదేమిటమ్మా! అవేం కాగితాలని! వాటినా కాల్చెయ్యడం?"

"నీది మరీ చోద్యం! ఇవన్నీ నువ్వు చదివి పారేసిన కాగితాలే గదరా బాబూ!"

లోకంలోని చరాచర ప్రాణులకు, జడజంగమ పదార్థాలకు రూపాంతర పరిణామమే గానీ నాశనం లేదని చెబుతారు. అలాగే మానవుడి మానసికోద్వేగాలకు సైతం నాశనం లేదనిపిస్తుంది. కాలం చాళ్ళలో పడి, పరిస్థితుల ఎండ వానల్లో నుండి దోహద క్రియలు పొంది భావబీజాలు రకరకాల పంటలుగా ఫలిస్తూ వెళ్ళడమే పరిణామ క్రమమేమో! టపావాడు మోసుకెళ్ళవలసిన ఆ కాగితాలు ఆ దేవుడి ఆగ్రహానికో, అనుగ్రహానికో పాత్రమై రూపాంతరం చెందుతుంటే చూస్తూ నిర్లిప్తుడినై కూర్చున్నాను.

—:సమాప్తం:—

కథా నిలయం
2912
శ్రీకాకుళం